



సీఆర్‌డీఏ కార్యాలయంలో విభాగాలను ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు

మీ త్యాగం మరువను

- నిలువనీడలేని రోజున కూర్చునేందుకు చోటిచ్చారు
- ఒక్క మాటతో వేల ఎకరాల భూమినిచ్చారు
- రాజధాని నిర్మాణానికి దారి చూపారు
- స్థల బలం, ఆడబిడ్డల పోరాటంతోనే నేటి అమరావతి
- సీడ్, కోర్ క్యాపిటల్‌లతో సింగపూర్ అద్భుతమైన ప్లాన్
- అమరావతి నుంచి నేరుగా ఏడు రాష్ట్రాలకు రోడ్లు
- గ్రీన్ ఎనర్జీతో కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దుతాం
- అట్టహాసంగా ప్రారంభమైన ఏపీ సీఆర్డీఏ కార్యాలయం
- రైతులు, మహిళలతో సీఎం చంద్రబాబు భావోద్వేగ ప్రసంగం

గుంటూరు,తుళ్లూరు అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): 'రాజధాని రైతులు, ఆడ బిడ్డలను మర్చిపోను. రాష్ట్ర విభజన జరిగి రాజధాని లేక, నిలువనీడ కూడా లేని సమయంలో కూర్చునేందుకు చోటు కల్పించి, భూము లిచ్చిన మిమ్మల్ని మరిచిపోవడమంటే.. మీ త్యాగాల ను మర్చిపోవడమే! ఒక్క పిలుపుతో వేల ఎకరాల భూములిచ్చారు. రాజధాని నిర్మాణానికి దారిచూపారు. రాజధానిని కాపాడుకోవడానికి ఆడబిడ్డలు ఉద్య మించారు. రాజధానిని నిలుపుకోవడం కోసం మీ ఆరాటం, చేసిన పోరాటం, పడిన అవమానాలు, పడ్డ ఇబ్బందులు ఏవీ నేను మర్చి పోలేను. అందుకే రాజధాని రైతులకు రెట్టింపు గౌరవం కల్పిస్తా. వారికి అండగా నిలుస్తా' అంటూ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. రాజధాని అమరావతిలోని రాయపూడి గ్రామంలో ఏపీ సీఆర్డీఏ కార్యాలయం సోమవారం ఉద యం సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా అట్టహాసంగా ప్రారంభమైంది. కార్యాలయంలోని సీఆర్డీఏ, సీడీఎంఏ, ఏడీసీఎల్, మినిస్టర్ చాంబర్లను ప్రారంభించారు. ఏడంతస్తులు తిరిగి కార్యాల యంలోని ఏర్పాట్లను పరిశీలించారు. గ్రౌండ్ ఫ్లోర్లో ఏర్పాటు చేసిన ధ్యాన బుద్ధ లోహ విగ్రహాన్ని, రిసెప్షన్, క్యాంటీన్‌లను పరిశీలించారు. ఫస్ట్ ఫ్లోర్లోని కాన్ఫరెన్స్ హాళ్లను పరిశీలించారు. అనంతరం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేని ల్యాండ్ పూలింగ్ కాన్సెప్ట్‌ను తీసుకువచ్చి ఒక్క పిలుపు ఇస్తే వేల ఎకరాలు ఇచ్చి, ం ాజధాని నిర్మాణానికి ముందుకు వచ్చిన

(మిగతా 8వ పేజీలో)



ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, ప్రక్కన ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, కలెక్టర్ అన్సారియా, నారాయణ







సీఆర్డీఏ భవన నిర్మాణానికి స్థలం ఇచ్చిన రైతులు ఆలూరి గోపాలరావు, అలపర్తి నారాయణరావుకు నూతన వస్త్రాలు అందజేస్తున్న సీఎం చంద్రబాబు



సీఆర్డీఏ ప్లాన్‌ను ముఖ్యమంత్రికి వివరిస్తున్న కమిషనర్ కన్నబాబు



కార్యాలయాన్ని పరిశీలిస్తున్న చంద్రబాబు



రాజధాని కోసం భూములిచ్చిన రైతులు, మహిళలతో సీఎం

సీఐ ఫిరోజ్ పోస్టింగ్‌పై టీడీపీ అధిష్ఠానం ఆరా

- పార్టీ శ్రేణుల నుంచి వివరాల సేకరణ
- సోషల్ మీడియా ద్వారా టీడీపీ శ్రేణులు ఉద్యమం
- టీడీపీ.. పోలీసు వర్గాల్లో కలకలం రేపిన ఆంధ్రజ్యోతి కథనం

(నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

ఎన్నికల ముందు టీడీపీ శ్రేణుల ను వేధింపులకు గురిచేయడంతో పాటు పర్చూరు టీడీపీ అభ్యర్థి ఏలూరు సాంబశివరావు ఓటమి కోసం సర్వశక్తులు వడ్డిన సీఐ ఫిరోజ్ ను నరసరావుపేట ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో నియమించడంతో పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. ఆయన పోస్టిం గ్‌కు వ్యతిరేకంగా సోషల్ మీడియా వేదికగా ఉద్యమాన్ని చేపట్టారు. టీడీపీ నేతలను ఓడిస్తానని శపథం చేసిన పోలీసుకు అందలం! అంటూ ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనం పార్టీ.. పోలీసు వర్గాల్లో కలకలం రేపింది. ఆంధ్రజ్యోతి క్లిప్పింగ్‌ను సోషల్ మీడియాలో పార్టీ నేతలు, కార్యకర్తలు సోమవారం వైరల్ చేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ అధి ష్ఠానం సీఐ పోస్టింగ్‌పై ఆరా తీసింది. పోస్టింగ్ అంశంపై పలువురు టీడీపీ నేతల నుంచి అభిప్రాయాలను కూ డా సేకరించింది. పోస్టింగ్‌కు ఎవరె వరు సహకరించారు. పోలీసు శాఖలో సహరించిన అధికారులు ఎవరు అన్న అంశాలపై అధిష్ఠానం దృష్టిసారించింది.



ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబుకు బొకే అందజేస్తున్న సీఐ ఫిరోజ్

మంత్రులకు పెద్ద ఎత్తున ఫిర్యాదులు

సీఐ ఫిరోజును నరసరావుపేటలో నియమించి అయనను గౌరవించార ని కొందరు పార్టీ నేతలు మండి పడ్డారు. మంత్రులు లోకేశ్, వంగల పూడి అనిత, గొట్టిపాటి రవి కుమార్ కు సీఐ నియామకంపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేశారు. సీఐపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తూ మెసేజ్‌లు చేయడం గమనార్హం. ఐజీ కార్యాలయంలో పనిచేస్తున్న సదరు అధికారికి ఊహించని రీతిలో పోస్టింగ్ ఇవ్వడంపై పోలీసుశాఖలోని కొందరు పెద్దల పాత్ర కూడా ఉం దన్న వాదనను పార్టీ వర్గాలు వినిపి స్తున్నాయి. పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విదేశీ పర్య టనలో ఉన్న సమయంలో సీఐకి పో స్టింగ్ ఇవ్వడం గమనార్హం. అయన నియోజకవర్గంలో ఉంటే పోస్టింగ్‌కు అడ్డుపడతారన్న అను మానంతోనే గప్‌చుప్‌గా నరసరావు పేటలో నియమించారన్న ప్రచారం జరు గుతోంది.

పార్టీ తీరుపై కార్యకర్తల గుర్రు..!

ఇక్కడ పనిచేస్తున్న సీఐ ఎంవీ చరణ్ వైసీపీ నేతతో కలసి ఉన్న ఫోటో వల్లనే అయనను బదిలీ చేశా రన్న ప్రచారం జరుగుతోంది. అయితే టీడీపీ శ్రేణులను వేధించడంతో పా టు, టీడీపీ అభ్యర్థి ఓటమి కోసం ఓట్ల అక్రమాలకు పాల్పడి సస్పెన్షన్ కు గురైన సీఐని ఇక్కడ ఎలా నియమించారని పార్టీ అధిష్ఠానాన్ని నేతలు, కార్యకర్తలు నిలదీస్తున్నారు. కాగా సీఐ ఫిరోజ్ ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబును మర్యాద పూర్వ కంగా కలిశారు. మొత్తం మీద పార్టీకి వ్యతిరేకంగా పనిచేసిన అధికారిని అందలం ఎక్కించడాన్ని టీడీపీ శ్రేణు లు జీర్ణించుకోలేక పోతున్నాయి.

శనగ.. సాగు ఎలా?



నరసరావుపేట ప్రాంతంలో సాగుకు సిద్ధం చేసిన పొలం

ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో పొగాకు సాగును ప్రభుత్వం నిషేధిం చింది. దీనికి ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని సూచించింది. ఈ నేపథ్యంలో మొక్కజొన్న, శనగ సాగు చేసేందుకు రైతులు సమాయత్తమ య్యారు. కొన్ని చోట్ల పత్తి కూడా సాగు చేశారు. అయితే ఈ మధ్య కాలంలో కురిసిన అధిక వర్షాలతో పత్తి పంట దాదాపు ఉరకెత్తింది. దీంతో పత్తి పంట ను కూడా తొలగించి శనగ సాగుకు రైతులు సిద్ధమయ్యారు. అయితే శనగ విత్తన కొరత రైతులను వేధి స్తోంది. ఇప్పటికే జిల్లాల వారీ గా వ్యవసాయ శాఖ ఏపీ సీడ్స్ సంస్థకు శనగ సాగుకు సంబం ధించి ఇండెంట్లు పంపినట్లు సమా చారం. కానీ ఇప్పటి వరకు ప్రభు త్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు.

- రాయితీ విత్తనం కోసం రైతులు ఎదురు చూపు
- ఇండెంట్ ఇచ్చిన వ్యవసాయ శాఖ
- స్పందన కరువు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గత ఏడాది పండించిన పొగాకుకు ధర లేక రైతులు దారుణంగా నష్టపోయారు. గత ఏడాది పల్నాడు జిల్లాలో 15,840 ఎక రాలు, బాపట్ల జిల్లాలో 65,180 ఎకరాలు, గుంటూరు జిల్లాలో 11,175 ఎకరాల్లో పొగాకు సాగు చేశారు. దీంతో ధర లేక రై త ు లు అల్లా



డుతున్న తరుణంలో, ప్రభుత్వమే కొను గోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పొగాకు కొనుగోలు చేయాల్సి వచ్చింది. ఇంకా కొంతమంది రైతుల ఇళ్ళలోనే పొగాకు నిల్వలు ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వం పొగాకు కొనడమే కాకుండా, పొగాకు సా గును నిషేధించింది. దీంతో ఎక్కువ మంది రైతులు ప్రత్యామ్నాయంగా శనగ పంట వైపు మొగ్గు చూపారు. శనగ విత్తేందుకు పొలాలను సిద్ధం చేసిన అన్నదాతలు విత్త నం కోసం ఎదురు చూస్తున్నారు. ఏటా రబీలో పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లా లో విస్తృతంగా శనగ సాగు చేస్తారు. గత ఏడాది బాపట్ల జిల్లాల్లో శనగ సాధారణ విస్తీర్ణం 74,572 ఎకరాలు. పల్నాడు జిల్లా ల్లో 29,495 గుంటూరు జిల్లాలో 19,925 ఎకరాలలో సాగు చేశారు. పొగాకుపై నిషే ధంతో ప్రత్యామ్నాయంగా శనగ సాగు చే పట్టే అవకాశాలు మెండుగా ఉండటంతో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుం దని వ్యవసాయ (మిగతా 6వ పేజీలో)

మెటల్ క్వారీలలో మైనింగ్ అధికారుల తనిఖీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యడ్లపాడు, అక్టో బరు 13 (ఆంధ్రజ్యో తి): యడ్లపాడు మండలంలోని కొండ క్వారీలలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌పై సోమ వారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'కొండలు కనుమ రుగు' కథనానికి అధికారులు స్పందించారు. అనుమతులు లేకుండా మండలంలోని విశ్వనాధుని కండ్రిక, వంకాయల పాడు రెవెన్యూ పరిధిలోని ఉప్పరపాలెం, వంకాయలపా డు గ్రామాల్లోని కొండల్లో మైనింగ్ అధికారులు స్థానిక రెవె న్యూ అధికారులతో కలసి సోమవారం మధ్యాహ్నం ఆకస్మి క తనిఖీలు నిర్వహించారు. ఉప్పరపాలెం పరిధిలోని కొండలలో అనుమతులు లేకుండా క్వారీయింగ్ జరుపు తుండడాన్ని గుర్తించి నిలుపుదల చేయించారు. క్వారీ ప్రదేశంలోని ఎస్కవేటర్‌ను, ఓ టిప్పర్‌ను సీజ్ చేశారు. అయితే ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని గమనించిన అక్రమార్కులు దాడులు జరుగుతాయన్న ఉద్దేశంతో ముందస్తుగా క్వారీలలోని వాహనాలను ఇతర ప్రాంతాల కు తరలించుకుపోయారు. ఈ తనిఖీలలో మైనింగ్‌శాఖ టీఏ కళ్యాణి, వీఆర్వో అశోక్, సిబ్బంది ఉన్నారు. కాగా మైనింగ్ ఏడి నాగిని మాట్లాడుతూ, వంకాయలపాడులో సీజ్ చేసిన ఎస్కవేటర్‌కు రూ.76వేలు అపరాధ రుసుం విధించి వసూలు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్‌కు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఉప్పరపాలెం కొండ క్వారీలో అధికారులు సీజ్ చేసిన ఎస్కవేటర్

ఏవోల ప్రమోషన్లకు లైన్ క్లియర్ 6లో..

విద్యార్థుల సంరక్షణే ప్రథమం

- సమీక్షలో కలెక్టర్ కృతికా శుక్లా

నరసరావుపేట కల్చరల్, అక్టోబర్, 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా లోని అన్ని వసతి గృహాలలో, కేజీబీవీలు, గురుకులాలలో భోజ నం, తాగునీరు, వసతులు, ప్రథమచికిత్స, పారిశుధ్యం వంటి కనీస వసతుల కొరత లేకుండా చూడాలని పల్నాడు కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో సంక్షేమ హాసళ్ళ నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వ హించారు.విద్యార్థుల సంరక్షణ ప్రథమ బాధ్యతగా వార్డెన్లు ఉం డాలని సూచించారు. సీజనల్ వ్యాధుల విషయంలో అప్రమ త్తంగా ఉండాలన్నారు. డయేరియా ఇతర జ్వరాలు నమోదైతే ఎలా స్పందించాలో తెలియజేస్తూ విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ చేయాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రపరిచి, ఆర్వో ప్లాంటలకు మరమ్మతులు చేయించాలన్నారు. అన్ని వస తి గృహాలలో తాగునీటి పరీక్షలు చేయించి మూడు రోజులలో నివేదిక అందించాలన్నారు. వసతి గృహాలలో పరిశుభ్రతపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవా లని ఆదేశించారు. పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సా ధించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఈవో చంద్రకళ, డీఎంహెచ్ఓ రవి, డీపీవో నాగేశ్వరనాయక్ సంక్షేమశాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

ఏఎంసీల మెరుగునకు.. మాస్టర్ ప్లాన్

- మార్కెట్ కమిటీ స్థలాల్లో కోల్డ్‌చైన్, అగ్రి ప్రాసెసింగ్ కేంద్రాల ఏర్పాటు
- సీఎం ఆదేశాలతో మార్కెటింగ్ శాఖ కసరత్తు

చిలకలూరిపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ)లకు త్వరలో మాస్టర్‌ప్లాన్‌లు రూపుదిద్దుకోనున్నాయి. పేరుకు నియోజకవర్గంలో ఒక ఏఎంసీ ఉన్నప్పటికీ కేవలం ఫంక్షనల్ యార్డుల్లోనే లావాదేవీలు జరుగుతోన్నాయి. మిగతా కమిటీలన్నీ పా డుబడినట్లుగా ఉంటున్నాయి. ఆయా కమిటీలు కేవలం చెక్‌పోస్టుల ద్వారా వచ్చే ఆదాయానికే పరిమితం అవు తున్నాయి. ఈ నేపథ్యంలో మాస్టర్‌ప్లాన్‌లు రూపొం దించడం ద్వారా మార్కెట్ కమిటీల్లో ఖాళీగా ఉన్న భవ నాలు, స్థలాలను ప్రాసెసింగ్ అవసరాలకు వినియోగిం చి తద్వారా వాటి ఆదాయం పెంచాలని సీఎం చంద్ర బాబు ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు మార్కెటింగ్ అధికారులు జిల్లాలోని ఏఎంసీలకు మాస్టర్‌ప్లాన్‌లను రూపొందించేందుకు కసరత్తు చేస్తోన్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 24 వ్యవసాయ మార్కె ట్ కమిటీలున్నాయి. వీటిల్లో కొన్ని మాత్రమే ఫంక్షనల్ గా గుర్తింపు పొందాయి. గుంటూరు, దుగ్గిరాల, పొన్నూ రు, తెనాలి, మంగళగిరి వంటి ఏఎంసీలలోనే వ్యవసా య ఉత్పత్తుల లావాదేవీలు జరుగుతుంటాయి. మిగతా



ఫిరంగిపురం ఏఎంసీలో ఖాళీగా ఉన్న భవనాలు

ఏఎంసీలలో ఖాళీస్థలాలు బోలెడన్ని ఉన్నాయి. ఫిరంగి పురంలో అయితే ఏకంగా ఈవీఎంల గోడౌన్‌కి అక్కడి ఏఎంసీ భవనాలను వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యం లో మాస్టర్‌ప్లాన్‌లు రూపొందించడం వలన ఎన్ని భవ నాలు ఉన్నాయి, ఖాళీ స్థలాలు ఎంత విస్తీర్ణంలో అందు బాటులో ఉన్నాయి, గోడౌన్ల సంఖ్య వంటి వాటన్నింటిపై స్పష్టత వస్తుంది. దాంతో కోల్డ్‌చైన్ కేంద్రాలను నిర్మించేందుకు అవకాశం ఉంటుంది.

ఈ కోల్డ్‌చైన్ కేంద్రాలలో రైతుల పంట ఉత్పత్తులు పాడైపోకుండా నిల్వ చేసుకోవచ్చు. అలానే సరుకుల విక్రయం జరిగిన తర్వాత కోల్డ్‌చైన్ కేంద్రం నుంచి గమ్యస్థానం వరకు నిర్ణీత ఉష్ణోగ్రతలో రవాణ చేయడా నికి వాహనాలుంటాయి. అలానే అగ్రి ప్రాసెసింగ్ సెంటర్లు అనేవి మనకు ఎక్కడా లేవు. వీటి ఏర్పాటు ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు అదనపు విలువని జోడించొచ్చు. ఇతర రాష్ట్రాలు, దేశాలు మన వ్యవసాయ ఉత్పత్తులను తీసుకెళ్లి అక్కడ ప్రాసెసింగ్ చేసుకొని అధిక లాభాలు గడిస్తోన్నాయి. ఉదాహరణకు మిర్చిలో తేమ శాతం అధికంగా ఉంటే రైతుకు ధర తగ్గించేస్తారు. అదే యార్డులో డ్రైయింగ్ యంత్రాలను ఏర్పాటు చేస్తే అక్కడే రైతులు మిర్చిని ఆరబెట్టించుకొని విక్రయించుకోవచ్చు. ఇలా అన్ని రకాల పంటలను ప్రాసెసింగ్ చేసి ఎగుమతులు చేస్తే అధిక లాభాలు గడించొచ్చని సీఎం చెప్పారు. దాంతో మాస్టర్‌ప్లాన్‌లను ఏ సంస్థతో తయారు చేయించాలనే దానిపై మార్కెటింగ్ శాఖ అధ్యయనం చేస్తున్నది.

ఏఎన్‌యూ వీసీగా సత్యనారాయణ రాజు



ఏఎన్‌యూ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఏఎన్‌యూకు ఆచార్య సత్యనారాయణరాజును నూతన వీసీగా నియమించింది. ఈ మేరకు ఏపీ ఉన్నత విద్యాశాఖ ఈ నెల 8న ఆయన నియామకానికి సంబంధించిన జీవోను జారీ చేసింది. వీసీగా ఆచార్య సత్యనారాయణరాజు నియామకం ఈ నెల 8 నుంచి అమల్లోకి వస్తుందని జీవోలో పేర్కొంటూనే తాత్కాలిక వీసీని రిలీవ్ చేసినట్లు మరో ఉత్తర్వు జారీ చేసింది. నూతన వీసీ రాక కాస్త ఆలస్యమవడంతో వర్సిటీ వర్గాల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన ప్రస్తుతం వీసీగా పనిచేస్తున్న బందా యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీలోనే ఉండిపోతారా అని వర్సిటీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. అయితే సోమవారం సత్యనారాయణ రాజు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఈ నెల ఆఖరుకు వీసీ గా బాధ్యతలు చేపడతానని తెలిపారు.

గూగుల్ రాకతో విశాఖలో టెక్ విప్లవం

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సురేష్ కుమార్



గుంటూరు సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గూగుల్ టెక్‌ను విశాఖకు తీసుకురావటం వల్ల అమరావతి ఐటీ హబ్ గా మారుతోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ అన్నారు. సోమవారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గూగుల్ రాకతో రాష్ట్ర యువతకు భారీ సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. అభివృద్ధి అంటే ముఖ్యమంత్రి చంద్రబాబు అని, గతంలో ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ తీసుకొస్తే నాడు దాని విలువ తెలియక పెదవి విరిచినా నేడు అది ఎందరికో ఉపయోగకరంగా నిలిచిందన్నారు. ఏపీలోని యువతకు ఉద్యోగాలు కల్పించి రాష్ట్రం అభివృద్ధి చెందటానికి చంద్రబాబు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. విశాఖ త్వరలో ఏఐ, డిజిటల్ సిటీకి రాజధానిగా మారనుందని చెప్పారు. ప్రపంచంలోనీ ప్రముఖ సంస్థలతో చర్చలు జరిపి నిరంతరం అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. పెట్టుబడి పెట్టే సంస్థలను అడ్డుకునేందుకు ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా అవి ఆగవని సురేష్ కుమార్ స్పష్టం చేశారు.


ప్రకాశం బ్యారేజీలో కొనసాగుతున్న వరద ఉధృతి



తాడేపల్లి టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది వరద ఉధృతి కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతో పాటు మున్నేరు, వెలగలేరు, కీసర తదితర ప్రధాన వాగుల నుంచి 73,796 క్యూసెక్కుల వరద నీరు సోమవారం ఇన్‌ఫ్లోగా నమోదవుతున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా దిగువకు 60,150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాలువకు 7,431 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 6,034 క్యూసెక్కులు, గుంటూరు చానల్ కాలువకు 181 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

సాగర్‌లో 2 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నాగార్జున సాగర్‌కు వరద నీరు వస్తుండడంతో అధికారులు సోమవారం 2 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. సాగర్ జలాశయం నీటి మట్టం 589.80 అడుగులు ఉంది. ఇది 311.44 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,040 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7684 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,008 క్యూసెక్కులు, 2 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు మేర ఎత్తి 16,158 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1200 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 68,090 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 68,090 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.



సాగర్‌లో 2 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

సత్రశాల నుంచి 58,122 క్యూసెక్కులు

రెంటచింతల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ నుంచి పులిచింతలకు 58,122 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు సోమవారం తెలిపారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి 49,389 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తోందని చెప్పారు. రిజర్వాయర్‌లో పూర్తిస్థాయిలో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమన్నారు. ప్రాజెక్టులో ఆదివారం వరకు 0.9558 ఎంయూల విద్యుత్ తయారైందన్నారు.

శ్రీబగళాముఖి అమ్మవారి ధర్మకర్తల పాలక మండలి ప్రమాణం



పాలకమండలి సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి నరసింహమూర్తి తదితరులు

పిట్టలవానిపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసియున్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానానికి ఎన్నికైన నూతనపాలకమండలి సభ్యులు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. దేవస్థానం ధర్మకర్తల పాలక మండలి ఛైర్మన్‌గా కలకోట చక్రధర్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా కె.నాగమణి, ఏవీ పద్మజ, ఎన్.సముద్రాలు, వై.వెంకటప్పయ్య, ఎ.ఉషారాణి, కె.పట్టాభిరామారావు, కె.అశోక్, కె.శివలీల, వక్కలగడ్డ ప్రసాద్, సి.హెచ్.రాంబాబు, అదనపు సభ్యులుగా డి.బల్లారెడ్డిలతో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో లింగోద్భవస్వామి దేవస్థానం ఛైర్మన్ పరిమి రామకృష్ణసాయిబాబు, శ్రీచెన్నకేశవస్వామి దేవస్థానం ట్రస్టుబోర్డు ఛైర్మన్ యెండూరి సాయిగుప్తా, మండల టీడీపీ అధ్యక్షుడు ఎండీ అఫ్జల్, టీడీపీ సీనియర్ నాయకులు లక్కంరాజు వెంకటపతిరాజు, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు కనుమూరి సాంబమూర్తిరాజు, అలకాపురం సర్పంచ్ మంతెన గంగరాజు, కోమలి సొసైటీ అధ్యక్షుడు ఉయ్యూరి వెంకటేశ్వరరావు, దోమా నాగేశ్వరరెడ్డి, కూటమినాయకులు కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఏవోల ప్రమోషన్లకు లైన్ క్లియర్

● 11 మంది సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి

గుంటూరు సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఏవో (అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)ల ప్రమోషన్ల ఫైల్‌కు ఎట్టకేలకు మోక్షం లభించింది. జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా వారి పదోన్నతులకు సోమవారం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నోట్ ఫైల్‌కు ఛైర్‌పర్సన్ ఆమోదం తెలపటంతో మిగిలిన ప్రక్రియ ఆరంభమైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న 11 మంది సీనియర్ అసిస్టెంట్లకు ఏవోలుగా పదోన్నతి లభించనుంది. మంగళవారం జిల్లా పరిషత్ ఛైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టీనా, సీఈవో వీర్ల జ్యోతి బసు ప్రమోషన్లకు సంబంధించిన ఉత్తర్వులను అందించనున్నారు.

టూత్ పేస్టుగా పొరబడి..

● ఎలుకల మందుతో పళ్లు తోముకొని మహిళ మృతి

నాదెండ్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): టూత్ పేస్టు అనుకొని ఎలుకల మందుతో పళ్లు తోముకొని ఓ మహిళ మృతి చెందింది. సాతులూరులో ఈ నెల 8వ తేదీన జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. నాదెండ్ల ఎస్ఐ జీ పుల్లారావు తెలిపిన వివరాల ప్రకారం, సాతులూరు గ్రామానికి చెందిన జెట్టిపతి పోలేరమ్మ (69) ఇంట్లో ఉన్న ఎలుకల మందును టూత్‌పేస్టుగా భావించి పళ్లు తోముకుంది. ఆమె అస్వస్థతకు గురి కావటంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం పోలేరమ్మ మృతి చెందింది. మనుమడు మల్లికార్జునరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పుల్లారావు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న మరో వ్యక్తి అరెస్టు

● కేజీ 70 గ్రాముల గంజాయి, బైక్, మొబైల్ స్వాధీనం

నకరికల్లు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తూ మరో వ్యక్తి పట్టుబడ్డాడని సత్తెనపల్లి రూరల్ సీఐ పి.కిరణ్ తెలిపారు. సోమవారం నకరికల్లు పోలీసుస్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ, నకరికల్లు శివారు శ్రీరాంపురం వద్ద రాజుపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన పోలిశెట్టి నాగరాజు అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో అతన్ని అదుపులోకి తీసుకొని సోదాలు చేయగా కిలో 70 గ్రాముల గంజాయి లభ్యమైందని తెలిపారు. దాన్ని స్వాధీనం చేసుకొని అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. గంజాయి అమ్మగా వచ్చిన డబ్బుతో అతడు కొత్తగా కొనుగోలు చేసిన బైక్‌ను, మొబైల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నాగారాజు అరెస్టుతో గంజాయి కేసులో మొత్తం పది మంది దొరికారని చెప్పారు. ఈ కేసులో ఉన్న మరో ఏడుగురిని త్వరలో అరెస్టు చేస్తామని సీఐ పేర్కొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	123, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

54,702 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 55,844 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 54,702 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 12,857 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	12500
334	10000	14800	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14200	334	10500	15000
273	10500	14000	నెంబరు. 5	10000	14500
341	10000	15500	341	10000	15600
4884	----	----	4884	10000	14200
సూపర్ 10	----	----	సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15000	తేజ	10000	15200
షార్క్-1	----	----	బ్యాడిగి	10000	15500
బ్యాడిగి	10500	15600	దేవనూరు డీలక్స్	10500	14700
దేవనూరు డీలక్స్	10000	14800	తాలుకాయలు	5000	7700

న్యాయవాద కోర్సుల పరీక్షలు ప్రారంభం



పరీక్షా కేంద్రంలో తనిఖీ చేస్తున్న పీజీ పరీక్షల కోఆర్డినేటర్ సుబ్బారావు

ఏఎన్‌యూ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పీజీ పరీక్షల విభాగం ఆధ్వర్యంలో సోమవారం మాస్టర్ ఆఫ్ లా (ఎల్ఎల్ఎం) ద్వితీయ సెమిస్టర్, ఐదు సంవత్స రాల ఆనర్స్ బీబీఏ ఎల్ఎల్‌బీ, బీఏ ఎల్ఎల్‌బీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఎల్ఎల్ఎం పరీక్షలు ఏఎన్‌యూతో పాటు, గుంటూరులోని జేసీ కాలేజ్ ఆఫ్ లా, ఏసీ కాలేజీ పరీక్షా కేంద్రాలలో కొనసాగుతున్నాయి. ఐదు సంవత్సరాల ఆనర్స్ పరీక్షలు విశ్వవిద్యాలయంలోని టీటీఎం విభాగంలో ప్రారంభమయ్యాయి. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక తనిఖీల బృందాలను నియమించినట్లు పీజీ పరీక్షల కో-ఆర్డినేటర్ ఆచార్య ఎం సుబ్బారావు తెలిపారు. వర్సిటీలో జరుగుతున్న పరీక్ష కేంద్రాలను సందర్శించి ఆయన తగు సూచనలు అందించారు.

గూడవల్లి ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చెరుకుపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గూడవల్లిలోని టీఆర్‌సీ ప్రభుత్వ ఐటిఐలో మిగిలి ఉన్న సీట్లకు 5వ విడత ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఆర్.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఐటిఐ.ఏపి.గవర్నమెంట్.ఇన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 16వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పదో తరగతి మార్కుల ఆధారంగా ఈ నెల 17న కళాశాలలో అడ్మిషన్లు నిర్వహిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 9398650408ను సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘంలో కలకలం

● జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా రాజీనామా

గుంటూరు సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘంలో కలకలం రేగింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆవిర్భావం నుంచి ఆయన అందులో చాలా కీలకంగా వ్యవహరించారు. జిల్లా కమిటీ నిర్మాణ విషయంలో కూడా ఎక్కువగా పాటుపడ్డారు. చాంద్ బాషా గుంటూరులోని ఖజానాశాఖలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నందున ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా వెంటనే ఆయన దగ్గరకు వచ్చేవారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చాలా సందర్భాల్లో ఉన్నత అధికారుల వద్ద నుంచి ఆయన అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తాజాగా జరిగిన బదిలీలలో ఆయనను అధికారులు కక్షపూరితంగా మంగళగిరి బదిలీ చేశారని, ఆ విషయంలో రాష్ట్ర కమిటీ నాయకులు సరిగ్గా స్పందించలేదన్న ఆరోపణలు ఉన్నాయి. బాషా రాజీనామాకు అదే కారణం అని తెలుస్తుంది. ఆయన రాజీనామాను ఆమోదిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు జిల్లా ఇంచార్జిగా జి.నాగసాయిని నియమించారు.

నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రికి కేంద్ర బృందం



నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నపిల్లల వార్డును పరిశీలిస్తున్న ప్రపంచ బ్యాంకు బృందం

పొన్నూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రిని సోమవారం కేంద్ర బృందం సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు గురించి ఆరా తీశారు. నిడుబ్రోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందిస్తున్న వివిధ రకాల వైద్య పరీక్షలు, వైద్య సేవలు, ఇన్ అండ్ అవుట్ వైద్య సేవల విభాగాలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే వివిధ రకాల వ్యాధులకు అందించే సేవలు ఉచితంగా పంపిణీ చేసే మందుల వివరాలను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ బ్యాంకు బృందం సభ్యులు డాక్టర్ ముహిర్దీన్, డాక్టర్ ఎడ్వర్డ్, గణేశ్ మారిముత్తు, నిడుబ్రోలు ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ ఫిరోజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

గోళ్ళ అరుణ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలి

● మాదిగ సంఘాల జేఏసీ నాయకుల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న మాదిగ సంఘాల జేఏసీ నాయకులు పేరుపోగు వెంకటేశ్వరరావు తదితరులు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని మాదిగ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గుంటూరు అరండల్‌పేటలోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ, పొలిమేర హరికృష్ణ, వేజండ్ల సుబ్బారావు మాదిగ మాట్లాడుతూ, తురకపాలెంలో ఎమ్మెల్యే చొరవతో గ్రామ ప్రజలకు వైద్య చికిత్సను అందజేశారని చెప్పారు. అంతేగాక బాధిత కుటుంబాలకు పరిహారం అందించేందుకు కృషి చేశారని తెలిపారు. అటువంటి వ్యక్తిపై నోరు పారేసుకోవడం సరైంది కాదని అన్నారు. దళిత ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు జోలికి వస్తే ఊరోకోమని హెచ్చరించారు. ఎమ్మెల్యేకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని లేని పక్షంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు దిగుతామని చెప్పారు. ఈ సమావేశంలో వాడవల్లి రాంబాబు, వెంకన్న మాదిగ, బుజ్జి, తిమోతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



వర్ల శ్రీను (ఫైల్‌ఫొటో)

పిడుగురాళ్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కొండమోడు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజుపాలెం మండలం పెదనెమలిపురి గ్రామానికి చెందిన వర్ల శ్రీను (49) మృతి చెందినట్లు ఎస్ఐ శివనాగరాజు తెలిపారు. వర్ల శ్రీను పెదనెమలిపురి గ్రామ టీడీపీ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. మృతుడు శ్రీను భార్య రాజ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శనగ.. సాగు ఎలా..?

(5వ పేజీ తరువాయి)

శాఖ అంచనా వేసింది. ఇప్పటికే విత్తనాల కోసం ఇండెంట్లు పంపింది. దీనిపై ఏపీ సీడ్స్ నుంచి ఉలుకు పలుకు లేదు. విత్తన సరఫరా జాప్యం జరుగుతోందన్న అభిప్రాయం వ్యవసాయ వర్గాల నుంచి వ్యక్తమవుతోంది.

శనగకు మద్దతు ధర క్వింటాల్‌కు రూ. 225 పెంపు

కేంద్ర ప్రభుత్వం శనగకు మద్దతు ధరను పెంచించింది. క్వింటాకు రూ 225 పెంచింది. గత రబీలో క్వింటాకు రూ 5,650గా ఉన్న మద్దతు ధరను ప్రస్తుత రబీ సీజన్‌లో 5,875కి పెంచింది. మద్దతు ధర పెరగడం శనగ సాగుకు కలిచివచ్చే అంశంగా ఉంది.

రాయితీ 25 నుంచి 50 శాతానికి పెంచాలి

వైసీపీ ప్రభుత్వం శనగ విత్తనం రాయితీని 50 నుంచి 25 శాతంకు తగ్గించింది. కూటమి ప్రభుత్వం కూడా గత ఏడాది శనగ విత్తనంకు 25 శాతం రాయితీని కొనసాగించింది. పంట మార్పిడి చేసే నేపథ్యంలో విత్తన రాయితీని పెంచాల్సి బాధ్యత ప్రభుత్వం పై ఉందని రైతులు కోరుతున్నారు. 50 శాతం రాయితీపై ఎకరాకు 40 కేజీల చొప్పున శనగ రాయితీపై విత్తన సరఫరాను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.ప్రభుత్వం గత ఏడాది కిలోకు రూ23.50 25శాతం రాయితీని అందించింది. 50 శాతంకు రాయితీ పెంచితే కిలోకు రూ 47 సబ్సిడీ రైతులకు అందే అవకాశం ఉంటుంది. ఎకరాకు శనగ విత్తనంకు రూ 1,880 రాయితీ రైతులకు లభించే అవకాశం ఉంటుంది. ఈ దిశగా ప్రభుత్వం స్పందించాలని అన్నదాతలు కోరుతున్నారు.

యువకుడికి సైబర్ కేటుగాళ్లు రూ.50వేల టోకరా

దాచేపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పోలీసు అధికారులమని చెప్పి ఓ యువకుడి నుంచి సైబర్ నేరగాళ్లు రూ. 50వేలు కాజేశారు. దాచేపల్లిలో ఓ చిన్న వ్యాపారం నిర్వహిస్తున్న శ్రీనివాసరావు అనే యువకుడికి పోలీసు అధికారుల మంటూ కొందరు వ్యక్తులు ఫోన్ చేశారు. తమకు రూ.50వేలు ఫోన్ పేలో జమ చేస్తే తాము ఆ మేరకు షాప్‌కు వచ్చి నగదును ఇస్తామని చెప్పారు. అవతలి వ్యక్తులు పోలీసులు అనేసరికి వారి మాటలు నమ్మిన శ్రీనివాసరావు రూ.50వేలను వారి ఫోన్‌పేలోకి జమ చేశాడు. అనంతరం రూ.50వేలు నగదు తనకు ఇవ్వాలని కోరాడు. అయితే అటునుంచి ఎటువంటి సమాధానం రాకపోవడంతో తాను మోసపోయినట్టు గ్రహించి పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు అవగాహన

సత్తెనపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నంది గామ సరస్వతి శిశు మందిర్ ఉన్నతపాఠశాలలో మహిళలకు వివిధ అంశాలపై నాలుగు రోజులుగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ కౌసల్య దేశంలో, కుటుంబంలో మహిళల పాత్ర తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళ విద్యావంతురాలు ఐతే ఆ కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందన్నారు. పర్యావరణానికి సంబంధించిన అంశాలపై కూడా అవగాహన కల్పించారు. విలువలతో కూడిన విద్యను అందించటంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కే అంజని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బదిలీ కోరుకున్న ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలి

సత్తెనపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): బదిలీ కోరుకున్న ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్ఎం సుభానీ సోమవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. పల్నాడు జిల్లాలోని పలు మండలాల్లో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయ నియామకాలు జరగలేదన్నారు. నలుగురు ఉన్నచోట ఇద్దరిని, ఇద్దరు ఉన్నచోట ఒక్కరిని, ఒక ఉపాధ్యాయుడు ఉన్నచోట ఎవ్వరినీ నియమించ లేదన్నారు. దీనివల్ల జూన్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులను ఎప్పుడు రిలీవ్ చేస్తారోనని గందరగోళానికి గురవుతున్నారన్నారు. తక్షణమే ఉపాధ్యాయులను కోరుకున్న స్థానాలకు బదిలీచేసి అవసరమైనచోట విద్యా వలంటీర్లను నియమించాలన్నారు.

వ్యక్తి కనిపించడం లేదంటూ ఫిర్యాదు

సత్తెనపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుక్కొని వస్తానని ఇంటినుంచి ఆటోలో సత్తెనపల్లి వచ్చిన వ్యక్తి కన్పించకుండా పోయాడంటూ కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ పోలీసులు తెలిపారు. ముప్పాళ్ళ మండలం దమ్మాలపాడుకు చెందిన విప్పాల సుబ్బారెడ్డి ఈనెల 9వ తేదీ ఉదయం దమ్మాలపాడు నుంచి సత్తెనపల్లి వచ్చాడు. ఆ రోజు నుంచి ఇంటికి తిరిగి రాకపోవటంతో సుబ్బారెడ్డి కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ లభించకపోవటంతో సోమవారం సుబ్బారెడ్డి కుమారుడు శ్రీనివాసరెడ్డి పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీధిలైట్లు ఏర్పాటు

దుర్గి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తేరాల గ్రామంలో సోమవారం టీడీపీ గ్రామ అధ్యక్షుడు గంగుల సిద్ధయ్య వీధిలైట్లను ఏర్పాటు చేశారు.

మహాధర్నాకు తరలివెళ్లిన ఎమ్మార్పీఎస్ నేతలు

దుర్గి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై జరిగిన దాడికి నిరసనగా ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన సోమవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన మహాధర్నాకు స్థానిక ఎమ్మార్పీఎస్ నేతలు తరలివెళ్లారు.

● కారంపూడి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీజే గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన విజయవాడలో నిర్వహించిన మహాధర్నాకు స్థానిక ఎమ్మార్పీఎస్ నేతలు తరలివెళ్లారు.

నేడు విద్యుత్ వినియోగదారులకు అవగాహన సదస్సు

మాచర్ల రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నూతనపాటి సింగయ్య తెలిపారు. ఈ సదస్సుకు మాజీ డిస్ట్రిక్ సెషన్స్ న్యాయమూర్తి, సీజీఆర్ఎఫ్ అధ్యక్షుడు విక్టర్ ఇమ్మానియేల్ పాల్గొననున్నట్లు చెప్పారు. డివిజన్ పరిధిలోని 11 మండలాల విద్యుత్ వినియోగదారులు హాజరై సమస్యలను పరిష్కరించుకోవాలని సింగయ్య కోరారు.

తొలగించిన వర్కర్స్‌ను విధుల్లోకి తీసుకోవాలి

పిడుగురాళ్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల ఆర్టీసీ డిపోలో వాషింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్న ఏడుగురిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆర్టీసీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వీ తులసీరామ్ మాట్లాడుతూ తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, నాలుగు సంవత్సరాల నుండి రావాల్సిన పెరిగిన వేతన బకాయిలు ఆర్టీసీ మేనేజ్‌మెంట్ కట్టిన పీఎఫ్ డబ్బు, కార్మికుల నుండి రికవరీ చేసిన పీఎఫ్ సంవత్సరానికి 8.5 శాతం వడ్డీతో చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు తెలగపల్లి శ్రీను పాల్గొన్నారు.

నేడు పచ్చదనం-పరిశుభ్రతపై కార్యదర్శులకు శిక్షణ

అమరావతి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లకు థీమ్ 5, పచ్చదనం పరిశుభ్రత, గ్రామ సుస్థిరత అభివృద్ధిపై శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో టీ పార్వతి తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమంలో తప్పనిసరిగా హాజరుకావాలని పార్వతి కోరారు.

శాఖా గ్రంథాలయానికి నూతన అభివృద్ధి కమిటీ ఎన్నిక

క్రోసూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): క్రోసూరు శాఖా గ్రంథాలయానికి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నూతన అభివృద్ధి కమిటీని ఎంపిక చేశారు. గ్రంథాలయ అధికారి వై వీరాంజమ్మ ఆధ్వర్యంలో అభివృద్ధి కమిటీ మొదటి సమావేశం సోమవారం జరిగింది. అభివృద్ధి కమిటీ అధ్యక్షునిగా బండారు మైసూర్ బాబు, ఉపాధ్యక్షునిగా ఎస్ఎం సుభానీ, కార్యదర్శిగా ఎస్ రాజేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా మన్నెం సాంబశివరావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.76 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 87,280 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, మూడు గేట్ల ద్వారా 65,090, మొత్తం 82,090 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ
రాష్ట్ర విభాగం కార్యదర్శిగా రామారావు

కారంపూడి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర విభాగం కార్యవర్గంలో కారంపూడికి చెందిన శ్రీవాసవీ సేవా అన్నప్రసాద కమిటి వ్యవస్థాపకుడు భవిరిశెట్టి రామారావు ఎన్నికయ్యారు. ఈనెల 19వ తేదీన మంగళగిరిలోని సీకె కన్వెన్షన్ హాలులో రాష్ట్ర అధ్యక్షుడు దేవతీ భగవన్నారాయణ, రాష్ట్ర కార్యవర్గం, కమిటీ చైర్మన్‌లు, వివిధ జిల్లాల అధ్యక్షులు ప్రమాణ స్వీకారం నిర్వహించనున్నారు.



భవిరిశెట్టి రామారావు

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



మాచవరం: శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో విష్ణు చిరంజీవి తదితరులు

కారంపూడి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తడి, పొడి చెత్తను సేకరించి పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో గంటా శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం అసిస్ట్, ఐటీసీ ఆధ్వర్యాన ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేరు చేసి విక్రయించడం, ఎరువులు తయారీ వలన సంపదను సృష్టించవచ్చన్నారు. అనంతరం గోడప్రతులను విడుదల చేశారు. కార్యక్రమంలో అసిస్ట్ పీవో రత్నకుమార్, రీసోర్స్‌పర్సన్ బొల్లయ్య, డిప్యూటీ ఎంపీడీవో కసిన్నానాయక్, ఏపీవో వెలుగు రంగారెడ్డి, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ సుబ్బారావు, శ్రీనివాస్, అనిల్‌కుమార్, ఏసోబు, పీఎస్‌లు వెంకటేశ్వర్లు, సుబ్బారావు, సతీష్, చెన్నకేశవరెడ్డి, సర్పంచ్ ఏడుకొండలు పాల్గొన్నారు.

● రెంటచింతల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్పంచ్‌లు, సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్స్‌కు ఘన వ్యర్థాల నిర్వహణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ ఎం నారాయణ పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛరథం, పారిశుధ్య కార్మికుల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మాచవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మన గ్రామాలను మనమే శుభ్ర పరుచుకోవాలని ఎంపీడీవో విష్ణు చిరంజీవి సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లకు క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమంపై ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో పరిశుభ్రత పాటించటం వల్ల అంటువ్యాధులు ప్రబలకుండా ఉంటాయని, ప్రజలందరూ ఆరోగ్య వంతమైన జీవితం గడపవచ్చని సూచించారు. గ్రీన్ అంబాసిడర్లకు తడి, పొడి చెత్త విడిగా అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ ప్రసాదు, ఏవో ప్రసాదు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన పెంచుకోవాలి

● కమిషనర్ శివన్నారాయణ



గురజాల: బైకు ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్, సచివాలయ సిబ్బంది



నకరికల్లు: పాల్గొన్న ఎంపీడీవో కాశయ్య, డిప్యూటీ ఎంపీడీవో ప్రసాదు తదితరులు

గురజాలటౌన్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ శివన్నారాయణ అన్నారు. సోమవారం జీఎస్టీ 2.0పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మున్సిపల్ కార్యాలయం నుంచి బ్రహ్మనాయుడు సెంటర్ మీదుగా బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

● మాచవరం: స్థానిక జీకే జూనియర్ కళాశాలలో సోమవారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్‌పై కళాశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీడీవో విష్ణు చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరై జీఎస్టీ తగ్గించటం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ ప్రసాదు, కో-ఆర్డినేటర్ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

● రెంటచింతల: ఎన్డీఏ ప్రభుత్వం అమలుచేస్తున్న జీఎస్టీ తగ్గింపు వలన సమాజంలోని అన్ని వర్గాలవారికి ఏదొక రూపంలో లబ్ధి చేకూరుతుందని, దీనిపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసరావు కోరారు. సోమవారం రెంటచింతలలోని సాగరమాత జూనియర్ కళాశాల విద్యార్థులతో జీఎస్టీపై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ఎలీషారాజు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు షేక్ ఖమర్, సుజాత, మనోజ, వినయ్‌రెడ్డి, శ్యామ్‌పాల్గొన్నారు.

● నకరికల్లు: సూపర్ జీఎస్టీ, సూపర్ పొదుపుతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక లబ్ధి చేకూరనున్నదని ఎంపీడీవో జీ కాశయ్య తెలిపారు. సోమవారం నకరికల్లులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నిత్యావసర సరుకులు, కాస్మటిక్స్‌పై జీఎస్టీ తగ్గుదల గురించి ఎంపీడీవో వివరించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ప్రసాదు, పీఆర్ ఏఈ కే సురేష్, జూనియర్ అసిస్టెంట్ ప్రసాదు, ప్రిన్సిపాల్ కొండవీటి లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● అచ్చంపేట: అచ్చంపేటలో సోమవారం సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అధికారులు, ప్రజాప్రతినిధులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో కార్యాలయం నుంచి ఆంజనేయుని విగ్రహం సెంటర్ మీదుగా ఎన్‌టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ జరిగింది. జీఎస్టీ గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, పాటిబండ్ల బాపిరాజు, పసుపులేటి పాపిరెడ్డి, వెనిగండ్ల కోటయ్య, నెల్లూరి వెంకటయ్య, ఏపీవో వెంకటేశ్వర్లు, పీఎస్ పంతులు నాయక్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

కొత్త సార్లతో పాఠశాలలు కళకళ

క్రోసూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ 2025 ద్వారా ఎంపికై నియామకపత్రాలు పొందిన నూతన ఉపాధ్యాయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. క్రోసూరు మండలంలోని వివిధ పాఠశాలల్లో 22మంది ఉపాధ్యాయులు నియమితులై ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. వారిలో 21మంది స్కూల్ అసిస్టెంట్‌లు, ఒక ఎస్‌జీటీ ఉన్నారు. జిల్లాస్థాయిలో ఆరోర్యాంకు పొందిన సుకన్య అనే ఉపాధ్యాయిని హసానాబాద్ ప్రైమరీ మోడల్ స్కూల్ జాయిన్ అయ్యారు. 21మంది స్కూల్ అసిస్టెంట్‌లు అనంతవరం, ఉయ్యందన దొడ్లేరు, గుడిపాడు, 88 తాళ్ళూరు, నాగవరం, ఊటుకూరు, క్రోసూరు పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించారు. కొత్త ఉపాధ్యాయుల రాకతో పాఠశాలలు కళకళలాడాయి. పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొత్త ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. నూతన ఉపాధ్యాయులకు ఎంఈవో జీ కృష్ణ, ఎంఈవో-2 గణేష్ అభినందనలు తెలిపారు.

● రెంటచింతల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో టీచరు పోస్టులు దక్కించుకున్న పలువురు రెంటచింతల మండలంలోని వివిధ గ్రామాల్లో ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. వీరికి ఎస్టీయూ, యూటీఎఫ్ సీనియర్ టీచర్లు స్వాగతం పలికి అభినందించారు. 31మంది టీచర్లు బాధ్యతలు చేపట్టగా వారిలో స్కూల్ అసిస్టెంట్స్ 8 మంది, సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులు 23 మంది ఉన్నట్లు ఎంఈవో-2 శివనాగేశ్వరరావు చెప్పారు.

● వెల్దుర్తి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వెల్దుర్తిలోని విద్యావనరుల కేంద్రంలో రిపోర్టు చేసి తమకు కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరారు. 95 మంది ఉపాధ్యాయులు బాధ్యతలు చేపట్టారు.

● విజయపురిసౌత్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విజయపురిసౌత్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10 మంది నూతన ఉపాధ్యాయులను నియమించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్య 4 నుంచి 14కు చేరింది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● రెంటచింతల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నూతన టీచర్లకు రెంటచింతలలో ఉచిత నివాస సదుపాయం కల్పిస్తున్నట్లు ఎస్టీయూ జిల్లా నేత లేళ్ళ శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం అంబేడ్కర్ కాలనీలోని మోడల్ పాఠశాలలో నూతన టీచర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మేరి కనకం, ఎంఈవో - 2 శివనాగేశ్వరరావు, టీచర్లు పాల్గొన్నారు.

● దుర్గి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులకు స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో ఎస్టీయూ నేతలు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జీసీహెచ్ అనంతరామయ్య, జిల్లా సభ్యుడు ఎర్రం ఏడుకొండలు, మండల ప్రధానకార్యదర్శి కనకం అపర్ణ, బూసాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● కారంపూడి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో నూతనంగా 49మంది ఉపాధ్యాయులు పాఠశాలల్లో నూతనంగా బాధ్యతలు స్వీకరినట్లు ఎంఈవోలు అనిల్‌కుమార్, రవికుమార్‌లు తెలిపారు. సోమవారం వారు ఉపాధ్యాయులు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు.

● దుర్గి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దుర్గి మండలంలో 79 మందికి గాను 64 మంది బోధనా గురువులు వచ్చేశారు. వీరికి సోమవారం ఎంఈవో కార్యాలయంలో రిటైర్డ్ డిప్యూటీ విద్యాశాఖాధికారి గాదె రామకృష్ణారావు చేతుల మీదుగా ఉద్యోగ ఉత్తర్వుల పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-1 షేక్ ఖాసీం, ఎంఈవో-2 బెజిమెన్, యూటీఎఫ్, ఎస్టీయూ, ఏటీఎఫ్ నేతలు జీవీ అనంతరామయ్య, అంగోతు శ్రీనివాసరావు, రవికుమార్, ఏడుకొండలు, అరుణ పాల్గొన్నారు.

● మాచవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల డీఎస్సీలో ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు యుటీఎఫ్ సంఘం సర్వీస్ రిజిస్టర్లు, డైరీలు తదితర మెటీరియల్‌ను అందజేశారు. సోమవారం మాచవరం జడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో నూతన ఉపాధ్యాయులకు మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు యడ్లపల్లి రామారావు, పుసులూరి రామయ్య, యూటీఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ జమాల్, మండల గౌరవ అధ్యక్షులు నరసింహారావు తదితరులు ఉన్నారు.

శివాలయంలో ఆరుద్ర నక్షత్ర పూజలు

పిడుగురాళ్ల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): చినఅగ్రహారంలో ఉన్న శ్రీగంగా పార్వతీ సమేత చంద్రమౌళేశ్వరస్వామి దేవాలయంలో ఆలయ అనువంశిక అర్చకస్వామి వెల్లటూరి చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో సోమవారం ఆరుద్ర నక్షత్రపూజలు నిర్వహించారు. స్వామివారికి రుద్రాభిషేకం, అన్నాభిషేకం, రుద్రహోమం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల
ఆత్మీయ సమ్మేళనం

పిడుగురాళ్ల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి 1992-93 బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం జరిగింది. నాటి జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఒకరినొకరు ఎంతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో కోపూరి అచ్చారావు, తూనుగుంట్ల మల్లేశ్వరరావు, చందవరపు రాంబాబు, వేముల కిషోర్, సురేష్, శంకర్, అన్నారావు, రంగానాయక్, డాక్టర్ భువనేశ్వరి, రమాదేవి, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సిబ్బంది
నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు

క్రోసూరు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కొద్దిరోజులుగా సమ్మెచేస్తున్న పీహెచ్‌సీల వైద్యులకు మద్దతుగా సోమవారం క్రోసూరు పీహెచ్‌సీ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఎదుట కొద్దిసేపు ప్రదర్శన నిర్వహించి వైద్యులకు మద్దతుగా నినాదాలు చేశారు. క్రోసూరు తాలూకా ఎన్‌జీవోల సంఘం మాజీ అధ్యక్షుడు శిఖా శ్యామ్‌సన్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పీహెచ్‌సీ వైద్యుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలన్నారు. వారికి తమ మద్దతు ప్రకటిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్‌లు, సూపర్‌వైజర్లు, ఫార్మాసిస్టులు పాల్గొన్నారు.


14 నుంచి
17వ తేదీ వరకు శిక్షణ

నకరికల్లు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 14వ తేదీన సర్పంచ్‌లకు, ఉప సర్పంచ్‌లకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ ఇస్తున్నట్టు ఎంపీడీవో కాశయ్య తెలిపారు. 15న క్లాప్ మిత్రలకు, షెడ్ మిత్రలకు, ఎంఆర్‌సీకి శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. 17న గ్రామ పంచాయతీల్లోని స్వయం సహాయక సంఘాల వీవోఏలకు, సభ్యులకు శిక్షణ ఇస్తున్నట్టు వివరించారు. సామర్థ్యాల పెంపునకు దోహదపడేలా శిక్షణ ఉంటుందని ఎంపీడీవో తెలిపారు.

ప్రజా సమస్యల
పరిష్కారమే లక్ష్యం: ఆర్డీవో

గురజాలటౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యాన గత నెల 16న మాచవరం మండలం, 17న గురజాలలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలలో 30 అర్జీలను పరిష్కరించినట్లు ఆర్డీవో మురళీకృష్ణ తెలిపారు. మాచవరం మండలానికి సంబంధించి 18, గురజాలకు సంబంధించి 12 అర్జీలను పరిష్కరించామన్నారు. ఆయా మండలాలకు సంబంధించి గత నెలలో 28న కొన్ని అర్జీలను పరిష్కరించామన్నారు.

చింతపల్లి బీట్ అధికారి పదోన్నతిపై బదిలీ



చింతపల్లి బీట్ అధికారి హుసేనయ్యను సన్మానిస్తున్న డీఆర్‌వో కే కుసుమకుమారి, సిబ్బంది

అచ్చంపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపల్లి బీట్ అధికారి, సెక్షన్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందిన పీ హుస్సేనయ్యను సోమవారం డిప్యూటీ రేంజ్ అధికారి కే కుసుమకుమారి ఘనంగా సన్మానించారు. తాడువాయి నర్సరీలో ఈయనను సన్మానించారు. హుస్సేనయ్య గుంటూరులోని కలెక్టర్ కార్యాలయంలో స్పెషల్ డ్యూటీపై బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో చింతపల్లి బీట్ అడిషనల్ అధికారి కే వరప్రసాదు బాధ్యతలు చేపట్టారు. హుసేనయ్యను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

డ్వాక్రా మహిళలకు పశు పోషణలో శిక్షణ



మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బీ వెంకటేశ్వర్లు నాయక్

నకరికల్లు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీఏ మండల సమాఖ్య ఆధ్వర్యంలో పశు సంవర్థక శాఖ అధికారుల సహకారంతో నకరికల్లు మండల సమాఖ్య కార్యాలయంలో డ్వాక్రా మహిళలకు పాడి పశువుల ఎంపికపై పశు సంవర్ధకశాఖ ఏడీ పీ వెంకటేశ్వర్లు నాయక్ మెలకువలను తెలిపారు. అధిక పాల దిగుబడికి సూచనలు చేశారు. పశువులకు బీమా చేసుకోవాలని సూచించారు. ఉపాధి పథకం ద్వారా మినీ గోకులం షెడ్లను నిర్మించు కోవాలన్నారు. పశుగ్రాసాలను సాగు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం జే సమాధానం, డాక్టర్ ఏ సాయి మహేష్‌రెడ్డి, సీసీలు పాల్గొన్నారు.

యువత ఉద్యోగాలే కూటమి లక్ష్యం

● నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్

బెల్లంకొండ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): యువతకు ఐటీ పరిశ్రమ, విద్యారంగంలో విస్తృత అవకాశాలు కల్పించేందుకే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ పేర్కొన్నారు. సోమవారం బెల్లంకొండ టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువత సాధికారిత పెట్టుబడులే లక్ష్యంగా సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో యువతకు ఉద్యోగాల కల్పనకు మంత్రి లోకేశ్ కృషి చేయటంతోపాటు రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయించే విదేశీ పర్యటనపై దృష్టి పెట్టడం హర్షణీయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకు పోతుందని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసిన ఘనత ఎమ్మెల్యే ప్రవీణ్‌కి దక్కిందన్నారు. నాయి బ్రాహ్మణులను రాష్ట్రంలో అభివృద్ధి పరిచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. సమావేశంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి మస్తాన్ షరీఫ్, మండల పార్టీ అధ్యక్షుడు అక్కల వెంకటరామిరెడ్డి, సొసైటీ చైర్మన్ ఓర్సు ఆనంద్, ఆసుల జగన్, సర్పంచ్ జ్యోతిసముద్రం, సయ్యద్ జానీ, రజాక్, సుభానీ, రసూల్, ఎన్ పిచ్చయ్య, కొండవీటి అహమ్మద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి: డీఎస్పీ

సత్తెనపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి సబ్ డివిజన్ పరిధిలో దీపావళి బాణ సంచా షాపులు ఏర్పాటుచేసేవారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని డీఎస్పీ హనుమంతరావు సోమవారం సూచించారు. నివాసాలకు దగ్గరగా తాత్కాలిక, శాశ్వత, బాణసంచా విక్రయషాపులు ఏర్పాటుచేయకూడని, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు సమీపంలో, విద్యుత్ తీగల కింద దుకాణాలు పెట్టకూడదన్నారు. దుకాణాల మధ్య 3మీటర్ల దూరం ఉండేలా చూడాలని, పొగతాగరాదనే బోర్డులు ఏర్పాటుచేయాలన్నారు. నీటి సదుపాయం కల్పించాలని, అగ్నిమాపక సాధనాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అనధికారికంగా బాణసంచా నిల్వచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలకు మించి నిల్వలు ఉంచకూడదని. చిన్నపిల్లలను పనిలో పెట్టుకోకూడదన్నారు. అనుమతి ఉన్నవారు నిబంధనల మేరకు వ్యాపారాలు చేయాలన్నారు. బాణసంచా అక్రమంగా తయారుచేసినా, నిల్వ ఉంచినా, విక్రయించినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాణసంచా విక్రయదారులు, కొనుగోలుదారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. బాణసంచా విక్రయ కేంద్రాలను రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులతో కలసి తనిఖీ చేస్తారన్నారు. తప్పనిసరిగా లైసెన్స్‌లు పొంది ఉండాలన్నారు.

బాణ సంచా దుకాణాల తనిఖీ

సత్తెనపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని, పట్టణంలోని పలు బాణసంచా దుకాణాలను ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, తహసీల్దార్ చక్రవర్తి, ఫైర్ సిబ్బందితో కలసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్‌లను, రికార్డులను తనిఖీ చేశారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. అనుమతులు ఉన్న దుకాణదారులే బాణసంచా విక్రయించాలన్నారు. ఎటువంటి ప్రమాదాలు జరిగినా షాపుల నిర్వాహకులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దండి

● శాసనసభ్యుడు బ్రహ్మానందరెడ్డి

మాచర్ల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని నూతనంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి సూచించారు. ఇటీవల మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన 98 మంది నూతన ఉపాధ్యాయులు సోమవారం మాచర్ల నియోజకవర్గ పరిధిలో బాధ్యతలు చేపట్టిన సందర్భంగా వారందరికీ అభినందనలు తెలిపారు. కూటమిప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విద్యకు పూర్వ వైభవం తీసుకొచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లు కృషి చేస్తున్నారన్నారు.

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలి

సత్తెనపల్లి రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): భూయజమానితో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మాగంటి హరిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతన కౌలు చట్టాన్ని తెస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక దాని విస్మరించిందన్నారు. కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపచేయాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చక్రవర్తికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, చలువాది లక్ష్మీనారాయణ, మక్కపాటి నరసింహారావు, పూర్ణయ్య, కౌలు రైతులు పాల్గొన్నారు.

దావుపల్లిలో కొనసాగుతున్న వైద్య శిబిరం

వెల్దుర్తి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని దావుపల్లిలో సోమవారం కూడా వైద్య శిబిరం కొనసాగించారు. గ్రామానికి చెందిన దామావత్ హరినాయక్ 15 రోజుల క్రితం అనారోగ్యంతో మంగళగిరిలోని ఎన్నారై ఆసుపత్రిలో చేరాడు. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో వైద్యులు గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. అయితే హరినాయక్ ఆసుపత్రిలో చేరకుండా స్వగ్రామమైన దావుపల్లికి చేరడంతో అధికారులు ఆదివారం జీజీహెచ్‌కు తరలించి వైద్య అందిస్తున్నారు. హరినాయక్‌కు మెలియాయి డోసిస్ అనే అరుదైన వ్యాధి సోకినట్లు గుర్తించి అధికారులు గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించడంతోపాటు పారిశుధ్య పనులు చేస్తున్నారు. ఈ వ్యాధి వలన ఎవరూ భయపడాల్సిన పనిలేదని, అంటువ్యాధి కాదని డాక్టర్ దాక్షాయని తెలిపారు. ఇంటింటికి తిరిగి నీటి శాంపిల్స్ తీసుకోవడంతోపాటు పలు సూచనలు చేస్తున్నారు. ఈ వైద్య శిబిరంలో సూపర్‌వైజర్ నాగేశ్వరి, హెచ్‌డీ శాంతకుమారి, హెల్త్ అసిస్టెంట్ స్వామినాయక్, ఏఎన్ఎం ప్రియాంకబాయి తదితరులు పాల్గొన్నారు.

చర్లగుడిపాడులో...

గురజాలటౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చర్లగుడిపాడు ఎస్సీ కాలనీలో మాడుగుల పీహెచ్‌సీ ఆధ్వర్యాన సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా రెండు రోజులుగా ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ శిబిరంలో సూపర్‌వైజర్ అల్లం శ్రీనివాసరావు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

రూ 2.37 కోట్ల ఉపాధి నిధుల విడుదల

నకరికల్లు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామి పథకం కింద పూర్తిచేసిన పనులకు నకరికల్లు మండలానికి రూ.2,37,13,500 గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమయ్యాయి. 36 పనులకు సంబంధించి 2014-19 సంవత్సరాలలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు వంటి పనులను అప్పట్లో పూర్తి చేశారు. బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్పందించిన కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నిధులు విడుదల చేసింది. నిధులు గ్రామ పంచాయతీల, కాంట్రాక్టర్ల వ్యక్తిగత ఖాతాల్లో జమ కావటంతో కాంట్రాక్టర్లు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

నూతన ఎంపీడీవోగా సీహెచ్ శ్రీనివాసరావు



ఎంపీడీవోగా బాధ్యతలు చేపడుతున్న శ్రీనివాసరావు

రెంటచింతల, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): నూతన ఎంపీడీవోగా సీహెచ్ శ్రీనివాసరావు సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈయన నాదెండ్ల నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండల ప్రజల సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఎంపీడీవో శ్రీనివాసరావును టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, ప్రభురాజు, శౌరైడ్డి, రాయపరెడ్డి, సొసైటీ చైర్మన్ జోజిరెడ్డి, ఎస్ శ్రీనివాసరావు, మండలపు హనిమిరెడ్డి, శౌంతిరెడ్డి నర్సిరెడ్డి, టి.కోటేశ్వరరావు అభినందించారు.


సీఆర్డీఏ కార్యాలయంలో ఉద్యోగుల ఛాంబర్


విద్యుత్ ఆటోలను సీఎంకు చూపుతున్న సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు


కార్యాలయంలో ఏర్పాటుచేసిన వివిధ విభాగాల వివరాలు తెలిపే సైన్‌బోర్డు

మీ త్యాగం మరువను!

(5వ పేజీ తరువాయి)

రైతుల త్యాగాలను ఆయన కొనియాడారు. ప్రజాధనాన్ని ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా నిర్మిస్తున్న సెల్ఫ్ మానిటైజేషన్ నగరమని, విమర్శకులు ఆ విషయం గుర్తించాలని హితవు పలికారు. సీడ్ క్యాపిటల్, దాని చుట్టూ కోర్ క్యాపిటల్, ఆ తరువాత సీఆర్డీఏ రీజియన్‌లతో సింగపూర్ అద్భుతమైన మాస్టర్ ప్లాన్ ఇచ్చిందని, దానితో రైతుల భవిష్యత్తు రాబోయే రోజుల్లో అద్భుతంగా మారుతుందని చెప్పారు. రైతులు అందివచ్చిన అవకాశాన్ని వదులుకోవద్దని, వారి భూములను అమ్ముకోవద్దని విజ్ఞప్తి చేశారు. హైటెక్ సిటీ రాక ముందు ఎకరా లక్ష రూపాయలు ఉన్న భూములు ఇప్పుడు ఎకరా 170 కోట్లు ఉందని చెప్పారు. దీనిని బట్టి భవిష్యత్ నగరం ఎలా ఉండబోతోందో ఆలోచించుకోవాలన్నారు.రాజధాని గ్రీన్ ఎనర్జీతో కూడిన కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దబోతున్నామన్నారు. ఒక వైపు కృష్ణమ్మ, మరోవైపు పచ్చని చెట్లతో అద్భుత నగరంగా అమరావతి ఉండబోతోందన్నారు. రాజధానిలో అద్భుతమైన రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. రాజధానిలోని ఏడు రోడ్లు నేరుగా ఇతర రాష్ట్రాలకు వెళతాయన్నారు. డ్రెయిన్లు, వాటర్ లైన్లు, విద్యుత్ లైన్లు అన్నీ ప్రత్యేకించి యుటిలిటీ డక్టుల్లో నిర్మిస్తున్నామని చెప్పారు. తద్వారా రేపటి అమరావతి అద్భుత నగరంగా మారబోతోందని చెప్పారు.


సీఆర్డీఏ కార్యాలయం ఫస్ట్ ఫ్లోర్ ఏరియల్ వ్యూ, రిసెప్షన్, విజిటర్స్ లాంజ్

● అమరావతికి స్థల బలం..

దేవతల రాజధాని అమరావతి అయితే.. మన ప్రజా రాజధాని అమరావతి అని సీఎం కొనియాడారు. దేశంలోని దేవాలయాల నుంచి మట్టి, పవిత్ర జలాలు తెచ్చి దేవుడి ఆశీస్సులతో ప్రారంభమైన నగరమని అన్నారు. సాక్షాత్తూ ప్రధాని పార్లమెంటులోని మట్టి, యమునా నదీ జలాలు తెచ్చి అమరావతికి తోడ్పాటునిచ్చారన్నారు. ఇప్పుడు కూడా రాజధానికి ప్రధాని ఎంతో తోడ్పాటునిస్తున్నారన్నారు. రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేసే బాధ్యత తనదేనని, అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆ బాధ్యతతోనే పవన్ కల్యాణ్, బీజేపీతో కలిసి పనిచేస్తున్నామన్నారు. 2047 వరకూ ఇదే ఒరవడి కొనసాగితే అమరావతికి అద్భుతమైన భవిష్యత్తు ఉంటుందన్నారు. అప్పటి వరకూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

● త్యాగాల ఫలితాలు రైతులే అనుభవించాలి

రాజధాని కోసం రోడ్డెక్కి పోరాడిన అమరావతి మహిళా రైతుల త్యాగం మరవలేనిదన్నారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు చేసి, వారు పడ్డ అవమానాలు, బాధలు అన్నీ గుర్తేనన్నారు. అందుకే తాను కూడా జోలె పట్టి వారికి అండగా నిలిచామన్నారు. కష్టాలు మరిచిపోవద్దని, రైతులు చేసిన త్యాగాల ఫలితాలను రైతులే అనుభవించాలన్నారు. ఫేజ్-1లో ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చారని గత పాలకులు రైతులను నానా హింసలు పెట్టారని సీఎం గుర్తుచేశారు. రాజధాని ఎడారని, స్మశానమనమని, వేశ్యల రాజధాని అనే స్థాయికి వారి ఉన్మాదం చేరిందని వాటన్నిటికీ సమాధానం చెప్పేలా రాజధానిని నిర్మిస్తానని చెప్పారు. 'రైతులకు రెట్టింపు గౌరవం దక్కేలా.. రెట్టింపు ఫలాలు అనుభవించేలా చేస్తా' అంటూ సీఎం హామీనిచ్చారు. రైతులు వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుంటే అనుకున్న లక్ష్యాలు సాధిస్తారన్నారు. ఇంటికో పారిశ్రామికవేత్త విధానం అమరావతి నుంచే ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, ధూళిపాళ్ల నరేంద్ర, కొలికపూడి శ్రీనివాసరావు, గుంటూరు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాబందుల శాంతియాత్రలా వైసీపీ ధర్నాలు

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం పేరిట రాష్ట్రంలో వైసీపీ చేస్తున్న ధర్నాలు రాబందుల శాంతియాత్రను తలపిస్తున్నాయని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. 2019 నుంచి 2024 మధ్య ప్రజల ప్రాణాలను పీక్కుతున్నది ఎవరో అందరికీ తెలుసని పేర్కొన్నారు. సిట్ విచారణలో నాటి అక్రమాలు, అరాచకాలపై ఆధారాలతో సహా అడ్డంగా దొరికారని తెలిపారు. ఇప్పుడు వాటిని కప్పిపుచ్చుకోవడానికే లేనిపోని రాద్ధాంతాలు, వారికి అలవాటైన అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిట్ తర్వాత ఇప్పటికే ఈడీ రంగప్రవేశం చేసిందని, వైసీపీ కోరుకుంటున్నట్లు సీబీఐ కూడా బరిలోకి దిగి వాళ్లను జైలులోకి నెట్టడం ఖాయమని అన్నారు. కల్తీ మద్యం తయారైంది వైసీపీ హయాంలోనేనని నిందితుడు జనార్దన్‌రావు చెప్పినా, కల్తీ మద్యంతో లాభాలు అర్జించుకుంది ఆ పార్టీ నాయకుడు జోగి రమేష్ అని తెలిసినా కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. కల్తీ మద్యం కేసులో నేడో రేపో జగన్‌రెడ్డి అరెస్టు ఖాయమని అన్నారు. రూ. 90 ఉన్న మద్యం సీసాను రూ.300కు అమ్ముకున్న బొల్లా బ్రహ్మనాయుడు కూడా దీనిపై మాట్లాడటం చాలా హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. వినుకొండ నియోజకవర్గంలో బెల్టు షాపులతో సమాంతర మద్యం వ్యవస్థను నడిపించింది ఆయన కాదా అని విమర్శించారు. సరఫరా చేసిన కల్తీ మద్యంపై కూడా సీసాకు ఇంతని బీ ట్యాక్స్ వసూలు చేశారని, ఆ విషయాన్ని మరిచిపోతే ఎలా అని జీవీ ప్రశ్నించారు.

చీఫ్ జస్టిస్‌పై దాడి అనాగరికం

● ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

● గుంటూరులో నిరసన ర్యాలీ, కలెక్టర్‌కు వినతిపత్రం


నిరసన ర్యాలీలో పాల్గొన్న మంద కృష్ణ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు

గుంటూరు (తూర్పు), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై దాడికి ప్రయత్నించడం అనాగరికమని, దానికి కారణమైన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. గవాయిపై దాడిని నిరసిస్తూ గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరం నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియాకు వినతిపత్రం అందించారు. అనంతరం మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ, సీజేను అవమానించిన నిందితుడిని అరెస్టు చేయకపోతే దేశంలో సామాన్య దళిత ప్రజలకు రక్షణ, గౌరవం ఉండదని అన్నారు. దాడిని ఖండిస్తూ దేశ ప్రధాని స్పందించిన తీరును పూర్తిగా స్వాగతిస్తున్నామని చెప్పారు. దళితులు ఉన్నత స్థానాల్లో కూర్చోవడం కొంత మందికి గిట్టడం లేదని అందుకే దాడులకు తెగ పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం చీఫ్ జస్టిస్‌పై జరిగిన దాడి కాదని, రాజ్యాంగంపై జరిగిన దాడి అని అభివర్ణించారు. ఇప్పటికైనా సీజే గవాయ్‌పై దాడిని ఢిల్లీ పోలీసులు తీవ్రంగా పరిగణించి నిందితుడికి కఠిన శిక్ష విధించాలని కోరారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృత్తం కాకుండా జాతీయ స్థాయిలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తున్నట్లు ప్రకటించారు. ర్యాలీలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు, ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వైకే విశ్వనాథ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రపోగు సురేశ్, ఎంఎస్పీ జాతీయ నాయకుడు కూచిపూడి సత్యం, ఎమ్మార్పీఎస్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు వేమూరి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

పల్లెలకు పాకిన డిజైన్ వర్క్స్

● కంప్యూటర్ డిజైన్‌తో మహిళలకు ఉపాధి ● శుభకార్యాలకు పెరుగుతున్న రద్దీ



బ్రాహ్మణపల్లిలో కంప్యూటర్‌తో జాకెట్‌పై డిజైన్ వేస్తున్న మహిళ

పిడుగురాళ్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): చీరలు, జాకెట్‌లపై మహిళలకు నచ్చే విధంగా వివిధ రకాల డిజైన్‌లను వేసి అందివ్వడం ఇప్పుడు పల్లెలకు పాకింది. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన ఇలాంటి అధునాతన డిజైన్‌లు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలలో కూడా ముద్ర రుణాలతో అందుబాటులోకి వచ్చాయి. పిడుగురాళ్ల, బ్రాహ్మణపల్లి, కరాలపాడు, కోనంకి, జానపాడు గ్రామాలలో అనేక మంది మహిళలు తమకు అనుకూలంగా ఉండే వ్యాపారాలను ఇంటి వద్ద నుంచి కొనసాగిస్తూనే కుటుంబ ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. ఒకప్పుడు జాకెట్‌పై కంప్యూటర్ డిజైన్, మగ్గం వర్క్ వేయాలంటే పట్టణాలకు పోయి అధిక వ్యయం వెచ్చించాల్సి వచ్చేది. ఇప్పుడు ఎక్కడికక్కడ గ్రామీణ ప్రాంతాలలోనూ పట్టణాలకు దీటుగా చీర, జాకెట్‌లపై డిజైన్, మగ్గం వర్క్‌లు అందుబాటులోకి వచ్చాయి. మహిళలు, పొదుపు సంఘ సభ్యులు తమ కుటుంబ ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రభుత్వం కల్పిస్తున్న ముద్ర, వడ్డీలేని, పావలా వడ్డీ రుణాలను ఉపయోగించుకొని తమ జీవన విధానం మార్చుకొని ఆదాయ మార్గాలవైపు అన్వేషిస్తున్నారు.

మెలియాయిడోసిస్ నమూనాల సేకరణపై శిక్షణ


శిక్షణలో వైద్యులు శోభారాణి, ముఖోపాధ్యాయ, మల్లేశ్వరి

గుంటూరు మెడికల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు గ్రామీణ మండలం తురకపాలెంలో మూడు నెలల వ్యవధిలో పెద్ద సంఖ్యలో వెలుగు చూసిన మరణాలు ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించాయి. తురకపాలెంలో 30 మంది గ్రామస్థులు మరణించగా, దీనికి మెలియాయిడోసిస్ జ్వరాలే కారణమని అనుమానాలు వ్యక్తమయ్యాయి. కొన్ని కేసుల్లో మెలియాయిడోసిస్ జ్వరాలకు కారణమయ్యే బర్ఖల్‌దేరియా సూడోమల్లీ బ్యాక్టీరియా ఉన్నట్లు కూడా తేలింది. ఈ నేపథ్యంలో సోమవారం గుంటూరు రీజినల్ పబ్లిక్ ల్యాబ్‌లో మూడు రోజులు పాటు మణిపాల్ వైద్య బృందం ఆధ్వర్యంలో పర్యావరణంలో, ముఖ్యంగా తడి నేలల్లో మెలియాయిడోసిస్‌కు కారణమయ్యే బ్యాక్టీరియా శాంపిల్స్‌ను సేకరించే విధానంపై వైద్యనిపుణులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమం సోమ, మంగళ, బుధవారాల్లో మూడు రోజులు పాటు కొనసాగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.విజయలక్ష్మీ తెలిపారు. ఈ మూడు రోజుల శిక్షణా తరగతుల్లో డాక్టర్ ముఖోపాధ్యాయ, డాక్టర్ శోభారాణి, డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి, డాక్టర్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌కు మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావును వీఆర్‌కు పంపుతూ రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 27న డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసే కార్యక్రమం సందర్భంగా విధుల్లో ఉన్న హైకోర్టు డ్రైవర్ లక్ష్మీ నారాయణపై రూరల్ సీఐ శ్రీనివాసరావు చొక్కా పట్టుకుని అనుచితంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ డ్రైవర్ నడిపే కారునే కాకుండా, హైకోర్టు కేసులకు సంబంధించిన ఫైల్స్ ఉన్న వాహనాన్ని కూడా రూరల్ స్టేషన్‌కు తరలించాలని ఆదేశించారు. హైకోర్టు జడ్జి ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా ఏకంగా ఎస్పీని పిలిపించి విచారించారు. దీంతో అదే రోజు సీఐ శ్రీనివాసరావుపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఆయనను వీఆర్‌కు పంపడం గమనార్హం. అయితే మంగళగిరి రూరల్‌కు ఇంకా ఎవరినీ నియమించలేదు.

వీఆర్‌కు తెనాలి వన్‌టౌన్ సీఐ రమేష్‌బాబు

తెనాలి వన్‌టౌన్ సీఐ రమేష్‌బాబును వీఆర్‌కు పంపారు. ఆయన గత వైసీపీ ప్రభుత్వంలోనే వన్‌టౌన్ సీఐగా నియమితులయ్యారు. రెండేళ్ళ సర్వీసు పూర్తికావడంతో ఆయనను బదిలీ చేసి ఆ స్థానంలో నెల్లూరు జిల్లా కృష్ణపట్నం మెరైన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న సాంబశివరావును నియమించారు.

అన్నపర్రు ఘటనపై అధికారుల విచారణ

పర్యవేక్షణ లోపమే దీనికి కారణమంటూ ఆగ్రహం

పెదనందిపాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అన్నపర్రు బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులు ఇటీవల కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన సంఘటనపై సోమవారం వైద్య ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ బి.సుబ్రహ్మణ్యేశ్వరి, బీసీ సంక్షేమశాఖ అడిషనల్ డైరెక్టర్ డి.చంద్రశేఖర రాజు విచారణ చేపట్టారు. సంఘటనకు గల కారణాలను విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇది పూర్తిగా పర్యవేక్షణ లోపమేనని, హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా లేవని దీని వల్లే విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ప్రతి రోజూ ఇలానే రుచికరంగా వండిపెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌కు తాగునీరు ఎక్కడి నుంచి సరఫరా అవుతుందని, నీటిని పరీక్షలు చేస్తున్నారా లేదా అని పంచాయతీ సిబ్బందిని ఆరా తీశారు. అస్వస్థతకు గురైన విద్యార్థి ప్రత్తిపాటి చిట్టిబాబును వైద్య పరీక్షలు ఎలా జరుగుతున్నాయని ఆరా తీశారు. సంఘటన సమయంలో అన్ని శాఖల అధికారులు తక్షణమే స్పందించడంతో పెనుప్రమాదం తప్పిందని అన్నారు. విద్యార్థుల పట్ల సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని హెచ్చరించారు. వారి వెంట సంక్షేమ శాఖ డీడీ మయూరి, వైద్యాధికారి ప్రియంవధ, సీహెచ్‌వో ఎస్ఆర్ ప్రసాద్‌స్వామి, హెచ్ఎం పాల్గొన్నారు.


సిబ్బంది నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న వైద్య ఆరోగ్య, బీసీ సంక్షేమశాఖ అడిషనల్ డైరెక్టర్లు

విద్యార్థులందరూ క్షేమం..!

అన్నపర్రు బీసీ హాస్టల్‌లో ప్రస్తుతం 26 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారని అధికారులు తెలిపారు. 9వ తరగతి చదువుతున్న ప్రత్తిపాటి చిట్టిబాబు అనే విద్యార్థికి వాంతులు విరోచనాలు అవుతుండడంతో వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. 30 మంది గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారని, ఒక విద్యార్థి ఎయిమ్స్‌లో ప్రత్యేక వార్డులో చికిత్స పొందుతున్నాడని చెప్పారు. 40 మంది విద్యార్థులను వారి తల్లిదండ్రులు స్వగ్రామాలకు తీసుకెళ్లగా వారిలో అక్కపాలెంకు చెందిన తమ్మిశెట్టి గోపీచంద్ అనే విద్యార్థికి వాంతులు, విరోచనాలు కావడంతో నరసరావుపేట ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నట్లు వారు వెల్లడించారు.

నేటి నుంచి 18 వరకు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రద్దు

గుంటూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రీ ఎన్ఐ, ఎన్ఐ పనుల కారణంగా ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు సికింద్రాబాద్-గుంటూరు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ సోమవారం తెలిపారు. గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను గుంటూరు-కాజీపేట మధ్యన రద్దు చేసి కాజీపేట నుంచి సికింద్రాబాద్‌కు ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు నడుపుతామన్నారు. గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 17వ తేదీ వరకు కాజీపేట వరకే నడుస్తుందని చెప్పారు. విశాఖపట్టణం-ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 17వ తేదీ వరకు గుంటూరు, పగిడిపల్లి మీదగా మళ్లిస్తున్నట్లు చెప్పారు. షాలిమార్-చర్లపల్లి, సీఎస్‌టీ-భువనేశ్వర్ ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 16, 17వ తేదీల్లో, చర్లపల్లి -షాలిమార్, భువనేశ్వర్- సీఎస్‌టీ ఎక్స్‌ప్రెస్‌లను ఈ నెల 17, 18 తేదీల్లో, కాకినాడ పోర్టు- సాయినగర్ షిర్డి ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 18న, షాలిమార్-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 15వ తేదీన గుంటూరు-పగిడిపల్లి మార్గంలోకి మళ్లిస్తున్నట్లు శ్రీధర్ పేర్కొన్నారు.

కొల్లిపరలో ఒకే రోజు ఆరు గృహాల్లో చోరీ

కొల్లిపర, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కొల్లిపరలో ఒకే రోజు ఆరు గృహాల్లో చోరీ జరిగింది. కొల్లిపరకు చెందిన ఉయ్యూరు వేమారెడ్డి, పుల్లారావు, సుబ్బారెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, జొన్నల శ్రీనివాసరెడ్డి గృహాల్లో సోమవారం తెల్లవారుజామున దొంగలు పడ్డారు. జొన్నల శ్రీనివాసరెడ్డి ఇంట్లో మాత్రం ల్యాప్‌ట్యాప్, వెండి వస్తువులు పోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ కోటేశ్వరరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కాగా, మండలంలోని గ్రామాల్లో గత ఏడు నెలలుగా వరుసగా జరుగుతున్న దొంగతనాలు ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. రాత్రి వేళల్లోనే కాకుండా పట్టపగలే దొంగతనాలు జరగడం ప్రజలను భయాందోళనకు గురిచేస్తోంది. గతంలో వరుసగా వల్లభాపురం, మున్నంగి, తూములూరు దొంగతనాలు జరిగాయి. ఇటీవల మంత్రి నాదెండ్ల మనోహర్ తూములూరు, కొల్లిపర గ్రామాల్లోని బాధిత కుటుంబాలను పరామర్శించి దొంగతనాలు జరుగకుండా కఠినంగా వ్యవహరించేటట్లు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డీఎస్పీ జనార్ధనరావు, సీఐ ఉమేష్, ఎస్ఐ కోటేశ్వరరావును పిలిచి గ్రామాల్లో జరుగుతున్న దొంగతనాలు పట్ల అజాగ్రత్త వహించవద్దని, రాత్రి సమయాల్లో పెట్రోలింగ్‌ను, గ్రామాల్లో సీసీ కేమేరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మంత్రి హామీని సవాల్ చేస్తూ కొల్లిపరలో మరో చోరీ జరగడంతో ప్రజలు మరింత భయపడుతున్నారు.


కొల్లిపరలో దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ కోటేశ్వరరావు

మాతృ, శిశు మరణాలపై అంతర్జాతీయస్థాయి అధ్యయనం!

● గుంటూరు జీజీహెచ్‌ని సందర్శించిన ప్రపంచ బ్యాంక్ బృందం

● రోగుల వైద్య సేవలపై ఆరా...పలు విభాగాల పరిశీలన

గుంటూరు మెడికల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి కొలమానం..రక్షిత మంచినీరు, మాతృ, శిశు మరణాల సంఖ్య. అభివృద్ధి చెందిన దేశాల్లో మాతృ, శిశు మరణాలు స్వల్పంగా ఉంటాయి. ఇటీవల కాలంలో మన దేశంలో కూడా మాతృ మరణాలు (ఎంఎంఆర్), శిశు మరణాలు (ఐఎంఆర్) రేటు బాగా తగ్గినట్లు కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో మాతృ, శిశు మరణాల రేటును అధ్యయనం చేసేందుకు ప్రపంచ బ్యాంక్ బృందం కొద్దిరోజులుగా రాష్ట్రంలో పర్యటిస్తోంది. సోమవారం ఈ బృందం గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిని సందర్శించింది. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి ప్రపంచ బ్యాంక్ బృందానికి స్వాగతం పలికారు. అనంతరం ఈ బృందం ఆసుపత్రిలో వివిధ విభాగాలను పరిశీలించింది. క్వాలిటీ ఎస్యూరెన్స్ నేషనల్ హెల్త్ మిషన్ తరఫున శిశు వైద్యవిభాగంతో పాటు అత్యవసర విభాగం పనితీరును పరిశీలించారు. ప్రపంచ బ్యాంక్ బృందంలో డాక్టర్ మొహిర్ జోన్, డాక్టర్ ఎడ్వర్డ్, డాక్టర్ గణేష్ మణిముత్తు, వాసు బాబు సభ్యులుగా ఉన్నారు. అత్యవసర విభాగం పనితీరు, అక్కడ రోగుల రద్దీని తగ్గించేందుకు తీసుకుంటున్న చర్యలను ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ చంద్ర రాధిక రాణి ఈ బృందానికి వివరించారు, శిశు వైద్య విభాగంతో పాటు నియోనేటల్ ఐసీయూ, పీడియాట్రిక్ ఐసీయూ విభాగాలను సభ్యులు పరిశీలించారు. ఇక్కడ నమోదౌతున్న ఐఎంఆర్, ఎంఎంఆర్‌ల గురించి పీడియాట్రీషియన్ డాక్టర్ ఝాన్సీరాణి వారికి వివరించారు. అనంతరం వివిధ వార్డులతో పాటు ఆపరేషన్ థియేటర్లలో చేపడుతున్న ఇన్ఫెక్షన్ కంట్రోల్ విధానాలను వైద్య సిబ్బందితో చర్చించారు. సూపరింటెండెంట్ ఛాంబర్‌లో డాక్టర్ రమణయశస్వితో సమావేశమై పలు అంశాలను ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు చర్చించారు. ఆసుపత్రిలో వైద్యసేవల కోసం పెద్ద సంఖ్యలో వస్తున్న రోగులు, మౌలిక వసతులు మెరుగుపరచవలసిన విషయాలపైన ఈ బృందం అధ్యయనం చేసింది. సమీప భవిష్యత్తులో మరింత లోతైన అధ్యయనం చేసి వైద్యాధికారుల నుంచి మరిన్ని ప్రతిపాదనలు స్వీకరిస్తామని ప్రపంచ బ్యాంక్ బృందం సభ్యులు వెల్లడించారు.


అత్యవసర వైద్య విభాగాన్ని సందర్శించిన ప్రపంచబ్యాంక్ ప్రతినిధులు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై శిక్షణ

బొల్లాపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల కేంద్రమైన ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీడీవో మాధురి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీలు, పంచాయతీ కార్యదర్శులు పారిశుధ్యానికి కృషి చేయాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు గ్రామాలను పరిశుభ్రంగా ఉంచటానికి ప్రతి ఒక్కరూ ప్రయత్నం చేయాలన్నారు. ప్రతి గ్రామంలో చెత్త సేకరణ సక్రమంగా చేయాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ బత్తి రాములు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రోటరీ ఆరోగ్య కేంద్రానికి రూ.30వేల విరాళం

చిలకలూరిపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ఆరోగ్య కేంద్రానికి మందుల కొనుగోలు నిమిత్తం సోమవారం ఇద్దరు సీనియర్ రొటేరియన్లు కాపు వెంకట్రావు రూ.20వేలు, దేవినేని శ్రీనివాసరావు రూ.10 వేలు విరాళంగా అందచేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం డాక్టర్ కందుల రంగారావు, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఉప్పుటూరి ప్రసాదు, బోడె రామసుబ్బారావు, డైరెక్టర్ దండా లక్ష్మీనారాయణ, తోటకూర వెంకటనారాయణ, కొల్లా శివప్రసాద్ పాల్గొన్నారు.

ఆరుగురిపై బైండోవర్ కేసులు

ఈపూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం అక్రమ కేసుల్లో ఆరుగురిని బైండోవర్ చేసినట్లు సీఐడీ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. ఈపూరు మండలం కొచ్చర్లకు చెందిన ఇద్దరు, రొంపిచర్ల మండలం సంతగుడిపాడుకు చెందిన ముగ్గురు, బొల్లాపల్లి మండలానికి చెందిన ఒకరిని ఆయా ఆయా మండలాలలోని తహసీల్దారుల వద్ద హాజరు పరచగా బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పీజీ ఆర్‌ఎస్‌కు రెండు ఫిర్యాదులు

రొంపిచర్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా గ్రీవెన్స్ కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు అందినట్టు తహసీల్దార్ బండి నిర్మల తెలిపారు.

వెల్లటూరులో గ్రోమోర్ కేంద్రం ప్రారంభం

బొల్లాపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరులో మన గ్రోమోర్ సెంటర్‌ను వినుకొండ ఏడీఏ రవికుమార్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అంకారావు, కోరమండల సిబ్బంది వికాస్, జోనల్ ట్రైనర్ అనీల్, ఏరియా మేనేజర్ శ్రావణ్, జాకీర్, నిజార్, స్టోర్ మేనేజర్ కిరణ్, సమీప గ్రామాల రైతులు పాల్గొన్నారు.

అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలి: ఎంపీపీ

నూజెండ్ల, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ మేడం జయరామిరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం స్థానిక స్థిరాభివృద్ధి లక్ష్యాలపై మూడు రోజుల శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పీ ఉమాదేవి, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ, రిసోర్స్ పర్సన్ ఎస్‌కే రబ్బానీ పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలంటూ సీపీఐ ధర్నా

వినుకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపాలెం, పట్టణంలోని 1వ వార్డు వెన్నపూసన కాలనీలో నివాసం ఉంటున్న యాదవ కులస్థులకు కులధ్రువీకరణ సర్టిఫికెట్లు ఇవ్వడంలో అధికారులు నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని దానికి నిరసనగా సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించి తహసీల్దార్ సురేష్‌నాయక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన

నరసరావుపేట రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు నష్టాన్ని తగ్గించడంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు తెలిపారు. స్థానిక కేసానుపల్లిలోని ఎంఏఎం కళాశాలలో ఇంటర్నేషనల్ డేఫర్ డిజాస్టర్ రెడ్యూషన్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఫైర్‌మెన్ పెనుమాక వెంకటేశ్వరరావు, సతీష్‌బాబు, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ దొండేటి చంద్రారెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

బొల్లాపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా బంజార సేవా సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మండలానికి చెందిన బీ రాము నాయక్, రామావత్ ఆర్ ఏడుకొండలు నాయక్‌లను స్టేట్ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకున్నారు. ఆదివారం విజయవాడలో సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం సభ జరిగింది.

● చిలకలూరిపేట: జాతీయ రహదారిపై చిన పసుమర్రు అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్యప్ప స్వాములు, మాల ధరించిన ఇతర స్వాములకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిత్యం నిర్వహిస్తున్నారు. దాతలు, భక్తులు, కమిటీ సభ్యుల సహకారంతో దసరా నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమం సంక్రాంతి వరకు కొనసాగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు వెలంపల్లి రవిశంకర్ సోమవారం తెలిపారు.

● నాదెండ్ల: మండలంలోని సాతులూరులోని రెడ్డిపేరంటాలమ్మ దేవాలయంలో 41రోజుల పాటు అయ్యప్ప మాల ధారులకు అందించే సద్ది కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. అయ్యప్ప మాలధారి జంపని లక్ష్మీనారాయణ కమిటీ ఆధ్వర్యంలో పీఠం ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అదేవిధంగా రామాలయంలో ఆదివారం రాత్రి బయ్యన వెంకట శ్రీనివాసరావు బ్రదర్స్ ఆధ్వర్యంలో స్వాములకు భిక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అర్జీల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

● కలెక్టర్ కృతికా శుక్లా ● పీజీఆర్‌ఎస్‌లో 152 అర్జీలు


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా, ఇతర అధికారులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా జిల్లా నలుమూలలు నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. పీజీఆర్‌ఎస్‌లో మొత్తం 152 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా అర్జీల పరిష్కారతీరు ఉండాలని స్పష్టం చేశారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండలన్నారు. ఫిర్యాదు దారులతో ముఖాముఖీ మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బంది నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి మురళి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ బి కృష్ణారావు

ఎస్పీ పీజీఆర్‌ఎస్‌కు 117ఫిర్యాదులు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బీ కృష్ణారావు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. పలు సమస్యలకు సంబంధించి 117ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పీజీఆర్‌ఎస్‌లో పరిపాలన అదనపు ఎస్పీ జేవీసంతోష్, క్రైమ్ అడిషనల్ ఎస్పీ లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో జీఎస్టీ 2.0పై అవగాహన


అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఈశ్వర్ ఇంజనీరింగ్ విద్యార్థులు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలో జీఎస్టీ 2.0లో భాగంగా సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమం సోమవారం జరిగింది. కార్యక్రమంలో బరంపేటలోని శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా ఎంఎస్‌ఎంఈ చైర్మన్ టీ శివశంకర్‌రావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ జాన్ స్టీవెన్సన్ పాత్రో, నరసరావుపేట వాణిజ్యపన్నుల శాఖ అధికారి ఎం.రామారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త, వనమా సాంబశివరావు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరవిందబాబు, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ జాన్ స్టీవెన్సన్ పాత్రో తదితరులు

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో...

నరసరావుపేట టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం కళాశాలలో జీఎస్టీ 2.0పై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎండీ డాక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ షేక్ కరీమ్ మొహిద్దీన్, కేసానుపల్లి పంచాయతీ సెక్రటరీ కోయ భార్గవశ్యామ్, విద్యార్థులు పాల్గొన్నారు.

● శావల్యాపురం: దేవవ్యాప్తంగా ఎన్డీఏ ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీని ప్రజలంతా సద్వినియోగం చేసుకుని ఆర్థిక వెసులుబాటు పొందాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య పిలుపునిచ్చారు. జీఎస్టీ చాంపియన్స్ కార్యక్రమంలో భాగంగా మండలపరిషత్ కార్యాలయం నుంచి శావల్యాపురం సెంటర్ వరకు పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బందితో కలసి సోమవారం బైకుర్యాలీని నిర్వహించారు.

రాజధాని అమరావతిలో జోరుగా నిర్మాణ పనులు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో రాజధాని నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయని, 90 ప్రాజెక్టులకు పాలనా అనుమతులు లభిస్తే 79 నిర్మాణాలు ప్రారంభంకావడం చంద్రబాబు మార్క్ అభివృద్ధికి నిదర్శనం అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పనుల పురోగతికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించిన సీఆర్డీఏ కార్యాలయమే రుజువు అని తెలిపారు. రాజధాని నిర్మాణంలో భాగమైన పలు ప్రధాన పనులు చురుగ్గా సాగుతున్నాయని పేర్కొన్నారు. నాలుగు రాష్ట్రాలకు చెందిన దాదాపు 11వేల మంది కార్మికులు రాజధానిలో రేయింబవళ్లు పనులు చేస్తున్నారని వివరించారు. మౌలిక వసతులు కల్పన, ప్రభుత్వ భవనాలు, ప్రైవేట్ కార్యాలయాలు, రహదారులు, కాలువలు, రిజర్వాయర్ల వంటి నిర్మాణ పనుల్లో రోజురోజుకీ పురోగతి కనిపిస్తోందని తెలిపారు. మొత్తం పనుల వ్యయాన్ని ప్రభుత్వం సుమారు రూ.54,693.09 కోట్లుగా నిర్ధారించిందని, నిధుల సేకరణలో కేంద్రప్రభుత్వం దశలవారీగా సహాయసహకారాలు అందిస్తోందని వివరించారు. తొలివిడతలో రూ.2,787 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. సీఆర్డీఏ ఆధ్వర్యంలో రూ.12,762.46 కోట్ల వ్యయంతో మొత్తం 19 ప్రాజెక్టులు, ఏడీసీఎల్ ద్వారా రూ.36,737.06 కోట్ల విలువైన మరో 60 ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని వివరించారు. అమరావతిని దేశంలోని ముఖ్య నగరాలకు అనుసంధానిస్తూ కొత్త రైల్వే లైన్‌కు ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు.

నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరిక


నియామక పత్రాలు అందజేస్తున్న ఎంఈవో సాంబశివరావు

శావల్యాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కొత్తగా నియమించిన 15మంది ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. స్థానిక ఎంఆర్సీ కార్యాలయంలో ఎంఈవో మద్దిగుంట్ల సాంబశివరావును నూతన ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలసి నియామకపత్రాలు అందజేసి విధుల్లో చేరారు. కొత్తగా విధుల్లో చే రిన ఉపాధ్యాయులకు యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఎస్టీయూ ప్రధాన కార్యదర్శి రాజారమేష్, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

● నూజెండ్ల : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో నూతన ఉపాధ్యాయులు 53 మంది సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. సెకండ్ గ్రేడు ఉపాధ్యాయులుగా 34మంది, పాఠశాల సహాయకులుగా 19 మంది విధుల్లో చేరినట్టు ఎంఈవోలు కే సత్యనారాయణ, ఎస్ రవిచంద్రలు తెలిపారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన ఉపాధ్యాయులకు ఎస్టీయూ నాయకులు అభినందనలు తెలిపారు.

● బొల్లాపల్లి: ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ - 2025లో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులు తమ కుటుంబ సభ్యులతో సోమవారం బొల్లాపల్లి ఎంఈవో కార్యాలయానికి రావటంతో అక్కడ ఉపాధ్యాయులతో కిక్కిరిసింది. ఎంఈవో చిన్నపరెడ్డి, పార్వతిలు చేతుల మీదుగా నూతన ఉపాధ్యాయిలు నియామక పత్రాలు అందుకున్నారు. నూతన ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో విధుల్లో చేరారు. మండలానికి 131 మంది నూతన ఉపాధ్యాయులు రావటంతో మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేకుండా పోయింది. ఈ సందర్భంగా నూతన ఉపాధ్యాయులకు యూటీఎఫ్, ఎస్టీయూ నేతలు వారి వారి యూనియన్ డైరీలు, క్యాలెండర్లు, రిజిస్టర్లు, జాయింట్ కావటానికి ఫారాలు, భోజనాలను ఏర్పాటు చేశారు.


బొల్లాపల్లి మండలంలో చంటి పాపతో ఉద్యోగానికి హాజరైన ఉపాధ్యాయిని స్వాతి

16న ఎన్‌ఈసీలో ఎన్‌సీసీ సెలక్షన్లు



ఎన్‌సీసీ సెలక్షన్స్ పోస్టర్ విడుదల చేస్తున్న ఎన్‌ఈసీ కళాశాల చైర్మన్ మిట్టపల్లి తదితరులు

నరసరావుపేట కల్చరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ఎన్‌సీసీ విభాగం, 23వ ఆంధ్రా బెటాలియన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న ఎన్‌సీసీ మొదటి సంవత్సరం ఎంపికలు జరుగుతాయని కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకటకోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపికలు జరుగుతాయని చెప్పారు. 2025-26 శిక్షణ సంవత్సరానికి సంబంధించి ఎన్రోల్‌మెంట్ పోస్టర్‌ను విడుదల చేసినట్లు తెలిపారు. వివరాలకు 9640626695 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.వెంకటేశ్వర్లు, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ మేడికొండ రాజేష్ వివిధ విభాగాధిపతులు, టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

షుగర్ నిర్ధారణ పరీక్షలు

వినుకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తారకరామనగర్‌లో సోమవారం ఉచిత షుగర్ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని గుంటూరుకు చెందిన కొనాక్ డయాగ్నస్టిక్స్ సహకారంతో రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ వారు నిర్వహించారు. సుమారు 100మందికి రక్తనమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించి వ్యాధికి సంబంధించి అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ చైర్మన్ చిరుమామిళ్ల కోటేశ్వరరావు, అధ్యక్షుడు ఏరువ వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శ్రామికుల ఈకేవైసీని వేగవంతం చేయాలి

● డ్వామా పీడీ సిద్దలింగమూర్తి


పొట్లూరులో శ్రామికులకు ఈకేవైసీ చేస్తున్న డ్వామా పీడీ లింగమూర్తి

పొట్లూరు (శావల్యాపురం) అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉపాధి హామీ శ్రామికుల ఈకేవైసీ ప్రక్రియను వేగవంతంచేసి త్వరితగతిన పూర్తిచేయాలని డ్వామా పీడీ సిద్ద లింగమూర్తి తెలిపారు. మండలంలోని పొట్లూరు, శావల్యాపురం గ్రామాల్లో జరుగుతున్న ఈ కేవైసీ నమోదు ప్రక్రియను ఆయన సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉపాధి శ్రామికులకు స్వయంగా ఈ కేవైసీ నమోదుచేసి దాని ఉపయోగాలను శ్రామికులకు వివరించారు.

● రొంపిచర్ల: మండలంలోని ఉపాధి హామీ పథకం శ్రామికులకు సంబంధిత జాబ్ కార్డులు కలిగిన వారికి ఈకేవైసీ చేస్తున్నట్టు ఏపీవో ప్రసాదు సోమవారం తెలిపారు. 28 గ్రామాలకు సంబంధించి 26,141 జాబ్ కార్డులు ఉన్నాయన్నారు. గత వారం రోజుల నుంచి ఈ కేవైసీని సంబంధిత గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్‌లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికీ 10,500 పూర్తిచేశామన్నారు. కొద్ది రోజుల్లో మిగిలిన వారికి కూడా ఈకేవైసీ పూర్తి చేస్తామని తెలిపారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువుల పంపిణీ

● కారుమంచి సొసైటీ చైర్మన్ శివప్రసాద్

కారుమంచి (శావల్యాపురం) అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా విడతలవారీగా ఎరువులు పంపిణీ చేస్తున్నామని కారుమంచి సొసైటీ చైర్మన్ గోపాళం శివప్రసాద్ తెలిపారు. కారుమంచి సొసైటీ పరిధిలోని వయ్యకల్లు గోడాము వద్ద సోమవారం అధికారులు, నాయకులతో కలసి రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. ఇన్‌చార్జి ఎంఏవో రామినేని రామారావు మాట్లాడుతూ ఖరీఫ్‌సీజన్‌లో రైతులు సాగుచేసిన పంటలను ఈ నెల 25వ తేదీలోగా ఈ క్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ గద్దె వీరమస్తాన్‌రావు, సొసైటీసీఈవో వెంకటనారాయణ, కారుమంచి టీడీపీ అధ్యక్షుడు ముప్పా గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఇళ్ల స్థలాలు అందజేయాలని సీపీఎం నిరసన

వినుకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సుందరయ్యనగర్, వికలాంగుల కాలనీల్లో నివాసం ఉంటున్న పేదలందరికి ఇళ్ల పట్టాలు అందజేయాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేద ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని, 25 సంవత్సరాలుగా రెండు కాలనీల్లో నివాసం ఉంటున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వర్షం కురిస్తే వర్షపునీటిలోనే నివాసాలు ఉండాల్సి వస్తోందని, వెంటనే ఇళ్ల పట్టాలు మంజూరుచేసి వెంటనే సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొంకూరి వెంకటేశ్వర్లు, ఎం.రామకృష్ణ, టి. గంగాధరరావు, శారమ్మ, అలివేలమ్మ, గాలెమ్మ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తిరుమల ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్ వైవీ నారాయణ

నరసరావుపేట రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమల ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ప్రముఖ స్నోవాసిస్ కంపెనీకి ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ నారాయణ తెలిపారు. ఒంగోలుకు చెందిన ప్రముఖ కంపెనీ స్నోవాసిస్ కంపెనీ ప్రతినిధులు సెప్టెంబరు 24, 25వ తేదీలలో కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 200 మంది విద్యార్థులు పాల్గొనగా ఆరుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు రూ.3.5 నుంచి 4 లక్షల వరకు వార్షిక వేతనం అందుకోనున్నట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డా వైవీ నారాయణ అభినందించారు. కార్యక్రమంలో కంపెనీ హెచ్‌ఆర్ శివక్రిష్ణ, కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.


వైసీపీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనలో పాల్గొన్న మాజీ మంత్రి రజిని

చిలకలూరిపేటలో వైసీపీ శ్రేణుల నిరసన

చిలకలూరిపేట, అక్టోబరు13 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం విషయంపై ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మాజీమంత్రి విడదల రజిని ఆధ్వర్యంలో సోమవారం వైసీపీ శ్రేణులు ప్రదర్శన చేశారు. పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి ఎక్సైజ్ సీఐ కొడాలి వినయ్‌కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం రజిని మీడియాతో మాట్లాడుతూ నకిలీ మద్యం గుట్టు తేలాలంటే సీబీఐ దర్యాప్తు అవసరం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైన్ షాపులు, బెల్ట్ షాపులు, పర్మిట్ రూములు, బార్ షాపులపై ఎక్సైజ్ శాఖ పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. వైన్ షాపుల కేటాయింపులో జరిగిన అక్రమాలను గుర్తించి అనర్హులను తొలగించాలని ఆమె కోరారు. వైసీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు షేక్ దరియావలి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వైసీపీ నిరసన కార్యక్రమం

వినుకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కల్తీ మద్యాన్ని అరికట్టాలని సోమవారం మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వైసీపీ కార్యాలయం నుంచి ఎక్సైజ్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బొల్లా మాట్లాడుతూ కల్తీ మద్యంపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడల్లో మోడల్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ


ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

వినుకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విజ్ఞాన్ యూనివర్శిటీలో జరిగిన అండర్ -19 ఎస్‌జీఎఫ్‌ఐ ఎంపికల్లో మండలంలోని చీకటీగలపాలెం మోడల్ స్కూల్‌లో ఇంటర్ సెకండియర్ చదువుతున్న విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పద్మావతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో చదువుతున్న పల్లెపోగు ఆకాష్, అమృతపూడి మహేష్‌లు ఎంపికయ్యారని, డివిజన్ స్థాయిలో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు కె.చతురాసాయి, యువ అనంతేష్, కబడ్డీలో కమతం సుకన్య ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ చిన్న పాపారావు, ఉపాధ్యాయులు కాశింపీరా తదితరులు పాల్గొన్నారు.


ప్రతిభ చూపిన విద్యార్థులతో చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య తదితరులు

ఏరోస్కేట్ బాల్‌లో కేరిడ్జి విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలో జరిగిన ఏరోస్కేట్ బాల్ అంతర జిల్లా ఎంపికలో కేరిడ్జి స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ జీ బర్నబాస్ సోమవారం తెలిపారు. అండర్ 14 గ్రూప్ విద్యార్థులు కే కార్తికేయ, ఎం మన్సూర్ పాషా, షేక్ ఇమ్రాన్, పీ కార్తికేయ, మోక్షరామ్‌చరణ్, ఏ గోపిహర్ష, ఏ లాస్యంజలి, జీ మధుశ్రీ చందు, ఎస్ మోక్షిత్, ఏ చైతన్యరామ్, ఎన్ ప్రభురామ్, కే సాయి సంప్రీత్‌లు ప్రథమ బహుమతి సాధించారన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకే చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, కోచ్‌లు ఫిరోజ్‌ఖాన్, ఖాజాబీలు అభినందించారు.

ఏఎంరెడ్డి ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెబినార్

నరసరావుపేట టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏఎంరెడ్డి ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సస్టెయినబుల్ స్టార్టప్స్‌పై సోమవారం వెబినార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన వక్త వీ రామకాంత్ హాజరై ప్రత్యేకంగా ఆన్‌లైన్ వేదికల ప్రయోజనాలు, మార్కెట్ రీచ్, డిజిటల్ టూల్స్ వినియోగం, స్థిరమైన వ్యాపార నమూనాలను గురించి వివరణాత్మకంగా తెలియజేశారు. కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ యువతలో సృజనాత్మకతను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఎం రెడ్డి ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున్, ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ భార్గవభూషణరావు, సమన్వయకర్తలు ఎం.మురళీకృష్ణ, డాక్టర్ ఆర్ సింహాచలం, విద్యార్థులు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ సాదినేని రామారావు, తదితరులు

ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

నరసరావుపేట టౌన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సంస్థ క్యూస్పైడర్స్ ప్రత్యేక ప్లేస్‌మెంట్ డ్రైవ్ సోమవారం స్థానిక ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ప్రతిభ చాటిన నలుగురు విద్యార్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరికి ఏడాదికి రూ.4లక్షలు వేతనం లభిస్తుంది. ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, చైర్మన్ మేరమెట్ల శేషగిరిరావు, ప్రిన్సిపాల్ సాదినేని రామారావు ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి జె.రవిశంకర్, అధ్యాపకులు రాధిక, నవీన్, సితార అభినందించారు.

ఆర్‌ఎస్‌ఎస్ 100 సంవత్సరాల ఉత్సవాలు

వినుకొండ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం 100 సంవత్సరాలుపూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం సాయంత్రం స్థానిక తారక రామనగర్‌లో ఉత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కొత్త రామకృష్ణ ఆర్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాలు, ఎన్ని రంగాల్లో విస్తరించిందో వివరించారు. ప్రజలు, సమాజం, పర్యావరణం కోసం పంచ పరివర్తన అనే ఐదు అంశాల కోసం ప్రజలందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చిరుమామిళ్ల కోటేశ్వరరావు, కొత్తమాసు రవి, గట్టుపల్లి శివప్రసాద్, నేరెళ్ల శ్రీనివాసరావు, ఐ.మల్లికార్జున, జి.కాశీ, కోట ప్రకాశ్ పాల్గొన్నారు.